ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

7th ANNIVERSARY
22nd October, 2025

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 302 | గురువారం | 02-10-2025 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' విజయ దశమి శుభాకాంక్షలు.

### సెలవు

విజయ దశమి (దసరా) సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

– ఎడిటర్










ప్రజాపక్షం
గురువారం, 02 అక్టోబరు

# నిరంకుశత్వం వైపు అడుగులు!

దేశం నిరంకుశత్వం దిశగా అడుగులు వేస్తున్న ధోరణులు పెరుగుతున్నాయి. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అమలుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలే నిదర్శనం. ఇది ఖర్చులను తగ్గిస్తుందని, అంతులేని 'ఎన్నికల సర్కస్'కు తెరపడుతుందని, స్థూల జాతీయోత్పత్తి 1.5 శాతం పెరుగుతుందని బిజెపి గొప్పగా చెబుతున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీల ప్రకారం ఇది అతిపెద్ద ఎన్నికల మోసం. రాజకీయ పునర్నిర్మాణంతో సహా ఒక పెద్ద ప్యాకేజీలో భాగం. నయాఉదారవాద ప్రాజెక్ట్ ఎంపిక చేసుకున్న పెద్ద లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి రాచమార్గం. రాజకీయ అధికార కేంద్రీకరణ.. సమాఖ్యవాదం విధ్వంసం.. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యం.. దాని ఆశ్రిత వర్గాలకు మరింత ప్రత్యేక హక్కుల కల్పన వంటి అత్యంత ప్రమాదకర భవిష్యత్తుకు ఊతం. ఎన్నికల ఖర్చు భారీగా తగ్గుతుందని, తద్వారా ఖజానాకు గొప్ప మేలు జరుగుతుందనే వాదన పూర్తిగా ఊహాజనితం. ఎందుకంటే, భారత ఎన్నికల కమిషన్ ఎన్నికలపై చేసే పరిపాలనా వ్యయం చాలా తక్కువ. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ వ్యయం 1952లో రూ. 10.5 కోట్ల నుండి 2014లో రూ. 3,870.3 కోట్లకు పెరిగింది. తదుపరి పెరుగుదలలను అనుమతించినప్పటికీ, కేంద్ర బడ్జెట్‌లో దీని వాటా నామమాత్రమే. ఏరకంగా చూసినా, ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల ఖర్చు తగ్గడం.. అర్థవంతమైన పొదుపు అద్భుతాలు సృష్టించడం మాటలకే పరిమితం. నిజానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచారాల ఖర్చును కలిపినప్పుడే, ఎన్నికల సమయంలో ధన ప్రవాహం చాలా విస్తారమవుతుంది. వివిధ స్వతంత్ర సర్వేల ప్రకారం 2019లో మొత్తం ఎన్నికల వ్యయం సుమారు రూ. 60,000 కోట్లు. 2024 నాటికి ఇది దాదాపు రెట్టింపు అయింది. ఒక్కోసారి సంవత్సరాలపాటు ఎన్నికలు స్తంభించిపోతున్న వ్యవస్థలో, ఒకేసారి ఎన్నికలు జరిపినంత మాత్రాన ఒరిగే ప్రయోజనం ఉండదు. ఇక స్వయం నియంత్రణలు, వ్యయంపై పరిమితులు ఓ నిరర్థక మిథ్యావాదానికి ప్రతీకలు. నిరాకారమైన పొదుపు వాదనతో ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదన ఆర్థికావసరం ఎంతమాత్రం కాదు. అది అధికారాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నం. ఒకే ఎన్నిక ద్వారా తగ్గిన మొత్తాలను మూలధన వ్యయానికి మళ్లిస్తే, అది ప్రజలకు కాదు.. ప్రైవేటు రంగానికే మేలు చేకూరుస్తుంది. కార్పొరేట్ రంగానికి పన్నుల మినహాయింపు, లక్షల కోట్ల రూపాయల మేర బకాయిల రద్దు వంటి చర్యలతో కేంద్రం 'ప్రైవేటు సేవ'లో పునీతమవుతుంది! ప్రజాధనం దారి మళ్లింపు అధికారికమవుతుంది. ధనిక, పేద వర్గాల మధ్య అంతరం మరింత పెరుగుతోంది. వాస్తవం చెప్పాలంటే, ఆర్థికాంశాలు కాదు.. రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రం 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను తెరపైకి తెస్తున్నది. అమలు చేయడానికి ఒత్తిడి పెంచుతున్నది. ప్రస్తుత విధానంలో ప్రభుత్వాలు తరచూ ప్రజల వద్దకు వెళ్లాలి.. ఫిర్యాదులు వినాలి... కనీసం పాక్షికంగానైనా స్పందించాలి. కానీ, ఒకసారి ఎన్నికలు జరిగిన తర్వాత, ఐదేళ్లపాటు ప్రజలతో సంబంధం ఉండకపోతే, ప్రభుత్వాలది ఇష్టారాజ్యమవుతుంది. పరిమిత జవాబుదారీతనం సమాజానికి నష్టం. దేశానికి ప్రమాదకరం. ఐదేళ్లపాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి, నిరంకుశంగా ప్రభుత్వాన్ని నడిపించడానికి వీలు ఉంటుందన్న బిజెపి అభిప్రాయం స్పష్టమవుతున్నది. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యానికి ప్రభుత్వం బదిలీ చేసే నిధులతో పోలిస్తే సబ్సిడీలు.. రుణమాఫీలు.. వేతనాల పెంపు తదితర అవసరాలకు బదిలీ చేసే అదనపు వనరుల పరిమాణం నామమాత్రమే. ప్రజా సమస్యలను తీర్చడానికి 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' మంత్రదండమేమీ కాదు. దీని వల్ల పునఃపంపిణీతోపాటు ఆహారం, వేతనాలు, సంక్షేమం కొత్తపుంతలు తొక్కుతుందనేది ఓ అభూత కల్పన. కార్పొరేట్ పన్ను మినహాయింపులు, ప్రైవేటీకరణ, కార్పొరేట్ భూ కబ్జాలకు నయాఉదారవాద ప్రభుత్వాలు ఊతమిస్తాయి. శ్రామిక ప్రజల బేరసారాల శక్తిని బలంగా అణగదొక్కుతాయి. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో కార్పొరేట్ దురాక్రమణ పెచ్చరిల్లుతుంది. సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపడుతుంది. రాజ్యాంగ విలువలు క్షీణిస్తాయి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. మరోవైపు, రాజ్యాంగ వ్యతిరేక 'డబుల్ ఇంజిన్ కీ సర్కార్' విధానాన్ని సంస్థాగతీకరించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. కేంద్రం, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే ప్రజలకు మేలు, అద్భుత ప్రయోజనాలు ఏవీ ఉండవుగానీ, పాలక వర్గ రాజకీయ పునర్నిర్మాణం మాత్రమే వేగవంతమవుతుంది. కార్పొరేట్ ఆర్థిక సామ్రాజ్యం మరింత బలోపేతం అవుతుంది. ఈ విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, దేశానికి అత్యంత ప్రమాదకరమైన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే బిజెపి ప్రతిపాదనను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ముక్తకంఠంతో తిరస్కరించాలి. ఇది చట్టంగా మారకుండా, దేశం యావత్తు ఒకేతాటిన నిలబడి ప్రతిఘటించాలి. నిరంకుశ పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి.

## రేపు ప్యారిస్‌లో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 80వ వార్షికోత్సవాలు

### అదే రోజున పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాగతాలపై

# రాష్ట్రంలో కార్మిక సంఘాల నిరసన



ఎస్.బాల్‌రాజ్
ప్రధాన కార్యదర్శి

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) 80వ వార్షికోత్సవాలు ఫ్రాన్స్ దేశంలోని ప్యారిస్‌లో నుండి 05.10.2025 వరకు జరుగుతున్నాయి. ప్రపంచ కార్మికలోకంపై జరుగుతున్న శ్రమదోపిడి, కార్మిక చట్టాలు అమలుకై 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 3వ తేదీ నుంచి ప్యారిస్‌లో జరిగే ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య వార్షికోత్సవాలు కార్మికవర్గ ఐక్యతకు, పోరాటాలకు, ఉద్యమాలకు ఊపిరి కావాలని ఆశిద్దాం. భారతదేశ కార్మికవర్గంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, ప్రపంచ దేశాలలో గ్రీస్లోని ఏథెన్స్‌లో కార్మికవర్గ పోరాటాలను విస్తృతపరుస్తూ ప్రపంచ కార్మికుల ఐక్యపోరాటాలు, ఉద్యమాలను డబ్ల్యుఎఫ్‌టియు చేస్తుంది. కార్మికుల పోరాటాలకు సానుభూతి, సహకారం, సమన్యాయం చేస్తూ కార్మికవర్గ పోరాటాలకు దోహదపడుతుంది.

డబ్ల్యుఎఫ్‌టియు ముఖ్య ఉద్దేశ్యం ప్రపంచ కార్మికుల ఐక్యత వర్థిల్లాలి. అదేవిధంగా ప్రపంచంలోని ఏ దేశాల మధ్యనైనా యుద్ధం నిలిపేందుకు కృషి చేస్తుంది. 1945లో డబ్ల్యుఎఫ్‌టియు ఏర్పడింది. 1949లో చీలిక ఏర్పడినా, తిరిగి ఆ సంఘాలన్నీ డబ్ల్యుఎఫ్‌టియుతోనే అనుబంధంగా మారాయి. డబ్ల్యుఎఫ్‌టియు తమ ఉద్దేశ్యాలను, ఆశయాలను కొనసాగిస్తున్నది. ప్రధానంగా పారిశ్రామిక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాతోపాటు యూరప్ దేశాలు, కార్మిక సంఘాల ఐక్యతతో పోరాటాలు కొనసాగిస్తున్నాయి. ప్రధాన ఉద్దేశం, ఆశయా లు, ప్రపంచ కార్మిక లోకం చేసే అన్ని పోరాటాలకు, ఉద్యమాలకు, చేస్తున్న సమ్మెలకు మద్దతు ఇస్తూ, కార్మికుల పోరాటాలు వారి హక్కులు కాపాడటంలో గొప్ప సహకారం, ప్రోత్సాహం అందిస్తుంది. కార్మికవర్గ పోరాటాలు వర్గరీత్యా కార్మిక సంఘాలకు అండగా ఉంటూ వారి పోరాటాలు నీరుగారిపోకుండా, అక్రమంగా తొలగించకుండ గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా కార్మికుల ఔన్నత్యాన్ని కాపాడుతుంది.

కార్మిక వర్గానికి యూనియన్ పెట్టుకొనే హక్కు చట్టబద్ధం చేయాలని, వివక్షత లేకుండా "పనిచేసే హక్కు ప్రాథమిక హక్కు" కావాలని, సెలవులతో కూడిన వేతనాలు చెల్లించాలని, డబ్ల్యుఎఫ్‌టియు నిరంతరం పోరాడుతోంది. సామాజిక చట్టాలను అమలుచేసేలా డబ్ల్యుఎఫ్‌టియు అథెన్స్, గ్రీస్ కింద ఉండి ప్రపంచ కార్మికవర్గాన్ని తమ హక్కుల కొరకు పోరాడుతుంది.


డబ్ల్యుఎఫ్‌టియు ప్రదర్శనలు చేస్తుంది. భారీ సంఖ్యలో కార్మికవర్గాన్ని సమీకరిస్తుంది. మానవత్వంతో సహాయ సహకారాలను అందిస్తుంది. తమ ఆశయాలను, ఉద్దేశ్యాలను విస్తృతంగా ప్రచారం చేస్తుంది. అనుబంధ యూనియన్‌లకు ఇతోధిక సహాయ సహకారం అందిస్తుంది. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ఎప్పటికప్పుడు కార్మికవర్గానికి తోడ్పాటునిస్తుంది.

డబ్ల్యుఎఫ్‌టియు గౌరవ అధ్యక్షులు జార్జ్ మాగ్రికోన్ 2024 డిసెంబరు 2న భారతదేశ అన్ని సంఘాలు నిర్వహించిన సెమినార్‌లలో ప్రసంగించారు. ప్రపంచ కార్మికులను ఏకంచేసి ఎల్లలు లేని ప్రపంచాన్ని నిర్మించడమే లక్ష్యంగా డబ్ల్యుఎఫ్‌టియు పనిచేస్తుంది.

ప్రపంచంలో ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 1860లో మొదటి ట్రేడ్ యూనియన్ లండన్‌లో ఏర్పడింది.

1920లో లాలా లజపతిరాయ్, జోసెఫ్, బాప్టిస్టా, ఎన్.ఎం. జోషి, దివాన్ చమన్‌లాల్ ఎఐటియుసి నాయకులు, లాలా లజపతిరాయ్ మొదటి ఎఐటియుసి అధ్యక్షులు. ఇది డబ్ల్యుఎఫ్‌టియులో క్రియాశీల పాత్ర పోసిస్తున్నది.

డబ్ల్యుఎఫ్‌టియు సభ్యత్వం 2022లో 105 మిలియన్‌లు. సభ్యత్వం గణనీయంగా పెరిగి 134 దేశాలు ప్రపంచ కార్మిక సమాఖ్యలో చేరాయి. 2025లో ప్యారిస్‌లో జరిగే 80వార్షికోత్సవ సభలో మరింత పెరిగే అవకాశం ఉన్నది. భవిష్యత్తులో సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, సమ సమాజం స్థాపించాలనే ఆశయంతో పయనిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అక్టోబరు 3 నుండి 5 వరకు ఫ్రాన్స్‌లో జరుగుతున్నాయి. ఇందులో ప్రపంచ కార్మిక సంఘాలు, అంతర్జాతీయ ఉద్యమాల తీరుతెన్నులపై అనుభవాలను పంచుకొనే అవకాశం ఉంది. అలాగే కార్మికుల భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరిగి, నూతన దిశా నిర్దేశం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.




**పాలస్తీనాకు డబ్ల్యుఎఫ్‌టియు సంఘీభావం**

వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ప్రపంచ వ్యాపితంగా అన్ని ప్రాంతాలలో పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని, అండగా ఉండి విజయవంతం చేయాలని పిలుపును ఇచ్చింది.

ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా గాజా భూభాగాన్ని అక్రమంగా ఆక్రమించుకొని ఖనిజసంపదను దోచుకొనేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహకారంతో పాలస్తీనా ప్రజలపై, భూ భాగంపై దోపిడీ చేసేందుకు పాలస్తీనాను నామరూపాలు లేకుండా జరుగుతున్న దాడులను ఖండించాలి, నిరసనలు తెలపాలి అని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపునిస్తుంది.

ఇజ్రాయిల్ దేశ దురాగాతాల వలన ఇప్పటికే 65,000 మంది పాలస్తీనా ప్రజలను చంపడమే కాకుండ 1,50,000 మంది ప్రజలను ఏ పని చేయలేని విధంగా క్షతగాత్రులను చేసింది. దొంగ దెబ్బలు తీస్తు దోపిడీకి తెగబడుతుంది.

గాజా, పాలస్తీనా పౌరులు ఇజ్రాయేల్ దేశ దురాక్రమణకు వ్యతిరేకంగా జరుగుతున్న హత్యలకు వేలాది ప్రజలు, బాల బాలికలు, వందలాదిమంది డాక్టర్లు మరియు ఆరోగ్య సంరక్షక వర్కర్లపై ఇజ్రాయెల్ దేశం జరిపిన బాంబుదాడులలో వేలాదిమంది హతమయ్యారు. ఇందులో 200 మంది జర్నలిస్టులు కూడా చనిపోవడం విచారకరం.

పాలస్తీనా ప్రజలు గాజా పాలస్తీనాను కాపాడుకొనేందుకు 50 వేల మంది ప్రజానీకం పెద్ద ఎత్తున భారీ ప్రదర్శన నిర్వహించి పాలస్తీనా ప్రజలకు అండగా ఉన్నామని ఇజ్రాయిల్ దేశానికి వ్యతిరేకంగా నిలబడటం డబ్ల్యుఎఫ్‌టియు గొప్పతనమే.


పాలస్తీనాలోని గాజా ప్రాంతాన్ని ఆక్రమించుకొనేందుకు యుద్ధం చేయడానికి అవసరమైన ఆహార పదార్థాలను, ఆయుధాలను చేరవేసేందుకు ఇజ్రాయిల్ పోర్టులో ఎగుమతి చేయకుండా, గాజా పాలస్తీనాను ఆక్రమించుకోకుండా వేలాదిమంది ఇజ్రాయిల్ దేశ పౌరులు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడటం డబ్ల్యుఎఫ్‌టియు చేసిన కృషి వల్ల గాజా పాలస్తీనాపై దాడులు ఆగాయి.

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య గాజా పాలస్తీనా దురాక్రమణకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సేనలకు వ్యతిరేకంగా డాక్ వర్కర్స్ ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్, ఇతర ప్రధాన పోర్టులలో పనిచేస్తున్న కార్మిక సంఘాల ఫెడరేషన్లు ఐక్యంగా మిలటరీ ఆయుధాలు, మిలటరీ సామాగ్రి తరలించేందుకు నిరాకరించడం ప్రపంచ కార్మిక లోకానికి ఒక గొప్ప సంకేతం. ఇది డబ్ల్యుఎఫ్‌టియు 134 దేశాలలో చేస్తున్న సేవలకు గుర్తింపునిస్తుంది.

భారతదేశ కార్మికవర్గం ఇజ్రాయిలో దురాగాతాలను, పాలస్తీనా ఆక్రమిత ఖనిజసంపద దోపిడీని ఖండిస్తూ ఇజ్రాయిల్ మిలిటరి చర్యలను ఉపసహరించుకోవాలని, ఉగ్రవాద చర్యలను, ఇజ్రాయిల్ సైనిక చర్యలను నిలిపివేసి వెస్ట్ బ్యాంక్ నుండి సైనిక బలగాలను విడనాడాలని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్‌లు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 3న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నారాయణగూడ ఫ్లైఓవర్ కింద అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరుతున్నాం. తద్వారా అమెరికా సామ్రాజ్యవాద ఇజ్రాయిల్ దేశానికి హెచ్చరిక చేసేందుకు, ఎఐటియుసి, సిఐటియు కలిసి నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

# గాంధీ జీవితం మనకు ఆదర్శం కావాలి

వలస పాలకుల కబంధ హస్తాల్లోంచి భరతమాతకు స్వేచ్ఛను ప్రసాదించడానికి అహింస, సత్య ధర్మాలు, సత్యాగ్రహం, సహనశీలత, స్వయం సమృద్ధి, స్వదేశీ వస్తు వినియోగం లాంటి పదునైన ఆయుధాలను ప్రయోగించి సఫలమైన జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శ జీవితం మనకే కాకుండా ప్రపంచ మానవాళి కూడా ఆదర్శంగా నిలిచింది, నేటికీ మనకు మార్గదర్శనం చేస్తూనే ఉన్నది. 02 అక్టోబర్ 1869న పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ పాఠశాల విద్య అనంతరం ఇంగ్లాండ్‌లో బారిస్టర్ కోర్సు పూర్తి చేసిన పిదప దక్షిణ ఆఫ్రికాలో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. దక్షిణ ఆఫ్రికాలో తాను చూసిన, అనుభవించిన జాతి వివక్ష పట్ల అహింసాయుత మార్గంలో వ్యతిరేకించారు, నాటి పౌర సమాజానికి ప్రేరణగా నిలిచారు. అతి సాధారణ జీవితాన్ని గడుపుతూ, ఉన్నత ఆలోచనలు చేస్తూ, సకల జీవుల పట్ల ఆదరణతో మన జీవితాలు కొనసాగాలని గాంధీ జీవితం సూచిస్తున్నది. 02 అక్టోబర్ 2025 రోజు గాంధీ జయంతితో పాటు విజయదశమి వేడుకలు కూడా కలిసిరావడం మరో అద్భుత సందర్భం.



మనం సాధించిన స్వతంత్ర భారతాన్ని సుందరంగా, సుసంపన్నంగా మార్చడానికి మనం నిత్యం కృషి చేయాలని ఆయన పిలుపును ఇవ్వడం మనకు తెలుసు. స్వాతంత్ర్యం కన్న పారిశుద్ధ్యమే మిన్న అని కూడా ఆయన పేర్కొనడం జరిగింది. పచ్చని పరిశుభ్ర భారత్ నిర్మాణంలో మనం భాగస్వాములమై దేశభక్తులుగా రుజువు చేసుకోవాలి అని కూడా ఆయన పిలుపు ఇచ్చారు.

మహాత్ముని కలలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ మిషన్' అనబడే ప్రతిష్ఠాత్మక జాతీయ పథకాన్ని 02 అక్టోబర్ 2014న ప్రవేశపెట్టి విజయవంతంగా 02 అక్టోబర్ 2019న భారత్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత దేశంగా మార్చడం, ప్రజారోగ్యానికి పట్టం కట్టడం మనకు తెలుసు. దేశ ఆర్థిక ప్రగతికి పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం ముడిపడి ఉంటాయని గాంధీ ప్రచారం చేసారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం హిందూ జాతీయతావాది నాథురామ్ వినాయక్ గాడ్సే గాంధీని హత్య చేయడంతో 30 జనవరి 1948న కన్నుమూసారు. ఆయన చనిపోయిన రోజును షహీద్ దివస్‌గా కూడా నిర్వహించుకుంటున్నాం.

గాంధీ బోధనల్లో శాంతియుత సహజీవనం, నీతి నిజాయితీ, సింప్లిసిటీ, సామాజిక న్యాయం, దయ, కరుణలు, సమానత్వం, స్వయం క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, అహింస భావనలు, సమయం నియంత్రణ, పరమత సహనం, సమన్యాయం, నిస్వార్థ జీవన విధానం, దేశాభివృద్ధికి తోడ్పాటు లాంటి సుగుణాలు పొందుపరుచబడ్డాయి.

గాంధీ జయంతి రోజు విద్యాలయాల్లో గాంధీ జీవితం ఆధారంగా పలు పోటీల నిర్వహణ, సదస్సులు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, నాటకాలు, దేశ భక్తి పునాదిగా సాంస్కృతిక కార్యక్రమాలు లాంటి పలు కార్యక్రమాలను యువత పరివర్తన కేంద్రంగా నిర్వహించవచ్చు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీ వినియోగించిన అహింస, స్వయం సమృద్ధి, సత్య ధర్మ విలువలే పదునైన ఆయుధాలుగా లక్ష్యాలను సాధించిన గాంధీ జీవితం మనకు నిత్య ప్రేరణ కావాలి.

# మనలోని రావణున్ని దహనం చేయలేమా!

హిందూ కాలపట్టిక ప్రకారం ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం పదవ రోజున ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం దసరా విజయదశమి వేడుకలను అత్యంత ఉత్సాహభరితంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుపోవడం జరుగుతున్నది. శ్రీరాముడు రాక్షస రావణుడిని సంహరించిన పవిత్ర రోజుగా మాత్రమే కాకుండా దుర్గాదేవి మహిషాసురుడిని వధించిన రోజుగా కూడా పర్వదినం జరుపుకోవడం కొనసాగుతున్నది. మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసిన దుర్గాదేవి పదవ రోజుల అనంతరం ఆ రాక్షసుడిని సంహరించడం జరిగిందనే విషయం మనకు తెలుసు. పాండవులు అజ్ఞాతవాసం పూర్తి చేసుకొని తిరిగి తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై నుంచి తీసి పూజలు చేసిన అనంతరం కౌరవులను ఓడించారని కూడా మనం శమీ పూజలు నిర్వహిస్తాం, జమ్మి ఆకును బంగారంగా భావించి మన ఆత్మీయులతో పంచుకుంటూ, అందరం క్షేమంగా, సురక్షితంగా ఉండాలని ప్రార్థనలు చేస్తాం. చెడుపై మంచి, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం విజయంగా విజయదశమి పర్వదినం నిలుస్తున్నది. మనం కూడా మన జీవిత లక్ష్యాలను సుసాధ్యం చేసుకోవడానికి మనలో ఉన్న బలహీనతలు లేదా చెడు అలవాట్లను త్యాగం చేసుకుంటూ బలాలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు సాగడానికి ఈ పర్వదినం ప్రేరణగా నిలుస్తున్నది. ఆయుధ పూజను చేసే ఆచారం మనలో జీవన సాఫల్య నైపుణ్యాలను పెంపొందించుకోవడాన్ని సూచిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో శరన్నవరాత్రి, తెలంగాణలో బతుకమ్మ పండుగలను శక్తి స్వరూపిణి ప్రతిరూపాలుగా పూజలుగా నిర్వహించుకుంటున్నాం. దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. మరునాడు వచ్చే మహర్నవమి అనంతరం వైభవంగా విజయదశమి వేడుకలు నిర్వహిస్తారు. శమీ పూజ, అపరాజిత పూజలను ఈ పవిత్ర దినాన నిర్వహిస్తారు. చెడుపై మంచి విజయంగా పదితలల రావణుడిని శ్రీరాముడు సంహరించిన రోజుగా రావణుడి దిష్టి బొమ్మను 'రావణ వధ' లేదా 'రావణ దహనం' కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతోంది. ఆ విధంగా తొమ్మిది రోజుల (నవరాత్రుల) పూజ అనంతరం పదవ రోజు విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటున్నాం.

ఈ రోజున దేశవ్యాప్తంగా దుర్గ, సరస్వతి, లక్ష్మి, గణేశ్ విగ్రహాలను సమీప నదుల్లో లేదా జలాశయాల్లో నిమజ్జనం చేస్తారు. పూజించాల్సిన వాహనా లు, ఆయుధాలు, పనిముట్లను శుభ్ర పరుచుకోవడం, ఆయుధాలను ఎరుపు వస్త్రాల్లో ఉంచడం, పవిత్ర గంగా జలాలను చల్లి శుద్ధి చేయడం, పసుపు, కుంకుమ, గంధం, పూల మాలలు సమర్పించడం, దీపం వెలిగించి ధూపం వేయడం, జమ్మి ఆకులతో పూజ చేయడం, అక్షింతలు, స్వీట్స్ సమర్పించడం లాంటి పవిత్ర ఆచారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుపోవడం ఆనవాయితీగా వస్తున్నది.

మనలోని రాక్షస ఆలోచనలకు నిప్పు పెట్టి, సదాలోచనలకు పూజలు చేసి ఆహ్వానించి మన జీవితాల్లో కూడా మనం విజయ తీరాలు చేరాలని విజయదశమి వేడుకలు బోధిస్తున్నాయి. చదువుతో పాటు సంస్కారం, అవసర నైపుణ్యాలను కూడగట్టుకొని, ఆ నైపుణ్యాలను పదునైన ఆయుధాలుగా మలుచుకొని మన లక్ష్యాలను ఛేదించే ప్రయత్నాలను మనఃస్ఫూర్తిగా చేద్దాం. సామరస్యం, శక్తి రూపం, ఐక్యత, చెడు త్యాగం, మంచిని ఆహ్వానించడం లాంటి లక్షణాలే చిహ్నాలుగా విజయదశమి దసరా వేడుకలు నిర్వహించుకుంటున్నాం. మనలోని చెడు ఆలోచనలపై మంచి భావనలు విజయం సాధించాలని కోరుకుందాం. విజయదశమి శుభవేళ ఏ పని ప్రారంభించినా విజయం వరిస్తుందని బలంగా నమ్ముతాం. సరికొత్త ఆలోచనలకు ఈ విజయదశమి శుభారంభం కావాలని ఆ దుర్గామాతను, శ్రీరామచంద్రుడు స్వామిని మనసారా కోరుకుందాం.

# జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణులు

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడుతున్నది. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవ వైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడగక ముందే కూడు, గూడు, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02– 08 అక్టోబర్ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు లేదా నేషనల్ వైల్డ్ లైఫ్ వీక్ నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయన్న భయంకర వాస్తవం నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపుటంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపి ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్ అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది.




జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమా లు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటితరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

(02–08 అక్టోబర్ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు సందర్భంగా)

# 'ఆదర్శమూర్తి' లాల్ బహదూర్ శాస్త్రి

వేసవికాలం ఎండల్లో సలసలమని మండుతున్న వీధులలో కాళ్లకు చెప్పులు లేకుండా మైళ్లకొద్దీ నడిచి పాఠశాలకు వెళ్లిన బాలుడు; స్వాతంత్ర్య పోరాటంలో ఏడేళ్లు జైలులో గడిపిన ధైర్యశాలి; దేశ ప్రధాన మంత్రి అయిన తర్వాత కూడా కఠినమైన నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆదర్శమూర్తి ఎవరో కాదు. ఆయనే లాల్ బహదూర్ శాస్త్రి. పదహారేళ్ల వయసులోనే గాంధీ పిలుపుకు స్పందించి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. వివాహంలో కేవలం చేనేత వస్త్రం, ఒక రాట్నాన్ని మాత్రమే కానుకగా తీసుకున్నారు. 'శాస్త్రి' అనే స్నాతకోత్సవ పట్టానే తన పేరులో భాగంగా చేసుకున్న ఈ ధీరుడు, భారతదేశ రెండవ ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించారు. శాస్త్రి అక్టోబరు 2, 1904న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న మొఘల్ సరాయ్ అనే చిన్న పట్టణంలో శారదా ప్రసాద్ శ్రీవాస్తవ, రామదులారీ దేవి దంపతులకు జన్మించారు. ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడే తన తండ్రిని కోల్పోయారు. పదవ తరగతి చదువుతున్న సమయంలో బెనారస్‌లో మహాత్మాగాంధీ, పండిట్ మదన్మోహన్ మాలవీయలు నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు వైదొలిగి సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరాలని మహాత్ముని పిలుపుతో ప్రేరణ పొందిన శాస్త్రి, తను చదువుతున్న పాఠశాల నుండి బయటకు వచ్చి పికెటింగ్, బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. లాలా లజపత్ రాయ్ స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో భాగంగా మొత్తం ఏడేళ్ల పాటు జైలు జీవితాన్ని గడిపారు. 1937, 1946 సంవత్సరాలలో యునైటెడ్ ప్రావిన్స్‌కు ప్రతినిధిగా ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు, జాతీయ నేతలు శాస్త్రి అపార శక్తి సామర్థ్యాలను గుర్తించారు. దేశ నిర్మాణంలో పాలుపంచుకోవలసిందిగా పిలుపు వచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో పార్లమెంటరీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. కొద్దికాలంలోనే స్వయంకృషితో రాష్ట్ర హోం, రవాణా శాఖ మంత్రిగా ఎదిగారు. రవాణా వ్యవస్థలో మొట్టమొదటిసారిగా మహిళా కండక్టర్లు ఆయన హయాంలోనే నియమించబడ్డారు. అల్లరి మూకలను చెదరగొట్టడానికి లాఠీలకు బదులు వాటర్ జెట్‌లను వినియోగించాలని పోలీసులకు సూచించారు. కఠోర శ్రమకు, సామర్థ్యానికి ఉత్తరప్రదేశ్‌లో శాస్త్రి ఒక సమున్నత సంకేతంగా నిలిచారు. తన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వ పెద్దలు ఆయన్ని కేంద్ర రాజకీయాలలోకి రమ్మని ఆహ్వానించారు.



**యువతకు స్ఫూర్తిదాయకం:** భారత ప్రభుత్వం 1966లో లాల్ బహదూర్ శాస్త్రికి మరణానంతరం భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన "భారతరత్న"తో సత్కరించింది. వినయం, సహనం, దృఢచిత్తం, అద్భుతమైన అంతఃశక్తితో కూడిన ఆయన ప్రజల మనసును అర్థం చేసుకున్న నాయకుడిగా ఎదిగారు. అంతేకాదు, గొప్ప దూరదృష్టితో దేశాన్ని ప్రగతి బాటలో ముందుకు తీసుకెళ్లారు. దేశ ప్రధానమంత్రిగా పదవి నుంచి దిగిపోయాక కూడా, మరణించే సమయానికి ఒక ఇల్లు కూడా లేని శాస్త్రి నిరంతర సేవామయ జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం.




ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
PRAJAPAKSHAM ★★★★
సంపుటి 08, సంచిక: 302 | గురువారం | 02-10-2025 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3% డిఎ

కేబినేట్ నిర్ణయం

జూలై 1 నుంచి అమలులోకి

57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఒకే

రబీ పంటల కనీస మద్దతు ధర పెంపు ప్రతిపాదనకు ఆమోదం

05

ట్రంప్ గాజా శాంతి ప్రణాళిక

## ఆక్రమణకు కొత్త ముసుగు

న్యాయమందించే మార్గం కాదు

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శ

05

## సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో భూకంపం

కుప్పకూలిన భవంతులు : 69 మంది మృతి

శిథిలాల్లో చిక్కుకున్న పౌరులు



## అజ్ఞాతం వీడండి

● లొంగిపోయిన మావోయిస్టులకు వేధింపులు ఉండవు ● స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహిస్తాం ● ఈ ఎన్నికలు సవాలుగా నిలిచాయి ● బాధ్యతల స్వీకరణలో నూతన డిజిపి శివధర్‌రెడ్డి

06

# వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి

● బిహార్ ఎన్నికల్లో 96 లక్షల కుటుంబాలకు రూ.10వేల చొప్పున పంపిణీ చేసిన బిజెపి ధనబలంతో గెలిచే యత్నం : సిపిఐ విమర్శ ● ప్రజలను మతపరంగా చీల్చుతూ అధికారాన్ని కేంద్రీకృతం చేసే కుట్ర : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మండిపాటు ● సిపిఐ 100 ఏళ్ల జాతీయస్థాయి ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న నిర్వహించనున్నట్లు వెల్లడి ● బిజెపిది లూటీకోరు ప్రభుత్వం : సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలో అధికార బిజెపికి అగ్ని పరీక్షలాంటి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేందుకు ఆ పార్టీ ధన ప్రవాహానికి తెర లేపిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అందులో భాగంగానే బిహార్‌లో 96 లక్షల కుటుంబాలకు రూ.10 వేల చోప్పున పంపిణీ చేసిందని విమర్శించారు.హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహాలు పాల్గొన్నారు.

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నింటిని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రజలను మత పరంగా చీల్చడంతో పాటు ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని అధికారాన్ని కేంద్రీకృతం చేసే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. బిజెపి ఫాసిస్టు విధానాలను వామపక్ష పార్టీలన్నీ కలిసి కట్టుగా ఎదుర్కోనట్లయితే దేశం ప్రమాదంలో పడనుందని సిపిఐ జాతీయ మహాసభల వేదికగా ప్రధాన వామపక్ష పార్టీల నాయకులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఇండియా కూటమి ఏర్పాటు ద్వారా బిజెపి బలాన్ని 240కి తగ్గించగలిగామని, మరింత ఐక్యంగా ముందుకు సాగడం ద్వారా బిజెపిని కట్టడి చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. సిపిఐ సంస్థాగతంగా, సైద్ధాంతికంగా బలోపేతం చేసుకోవడం ద్వారా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ దేశ వ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమాలకు సంసిద్ధం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సిపిఐ జాతీయ మహాసభలో తెలంగాణకు సరైన ప్రాతినిధ్యం లభించిందన్నారు. పార్టీలో యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయం మేరకు ఈ మహాసభలో 75 ఏళ్లు నిండిన నాయకులంతా ప్రధాన బాధ్యతల నుంచి తప్పుకున్నారని పల్లా వెంకటరెడ్డి వెల్లడించారు.

**డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ**

సిపిఐ 100 ఏళ్ల జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాలను డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు పల్లా వెంకట రెడ్డి తెలిపారు. సిపిఐ జాతీయ నాయకులతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్య నేతలు పాల్గొంటారని వెల్లడించారు. బహిరగ సభకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘఢ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయనున్నట్లు

తరువాయి 6లో










ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దసరా శుభాకాంక్షలు
IPE 2025 ఫలితాలల్లో
Jr. MPC 468 Sk. Asra 470
State 1st ర్యాంకులతో KLN సంచలనం
Jr. BiPC 438 K. Meghana 440
467
992
990
434
985
985
TG EAPCET 2025 20వేల లోపు ర్యాంక్‌లు సాధించిన మా విద్యార్థులు
983 3315 5068 9094 9896 10258 10389 11411
11531 11610 11748 12419 12618 16469 16649 18397
JEE Mains 2025 5 వేల లోపు ర్యాంక్‌లు సాధించిన మా విద్యార్థులు
AIR 3330 M. Bharath
AIR 3861 K. Abhiram
AIR 3967 P. Ranga
తెలంగాణ రాష్ట్ర విద్యారంగ చరిత్రలో సంచలన విజయాలకు కేరాఫ్ అడ్రస్ KLN JUNIOR COLLEGE
సమర్థవంతంగా, స్పష్టమైన ప్రణాళికతో Regular Inter తోపాటు EAMCET, JEE Main & NEET పరీక్షలకు Coaching ఇస్తున్న సంస్థ
KLN JUNIOR COLLEGE
(Knowing & Learning in New way)
Boys Campus Church Road, Miryalaguda
Girls Campus Hanumanpeta, Miryalaguda
✆: 9866739047 | 9440753434 | 9440441067 | 9052435837


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
పాఠకులకు, పాత్రికేయులకు,
యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
షాద్‌నగర్ పట్టణ ప్రజలకు
విజయదశమి శుభాకాంక్షలు
అందె జంగరాజ్ ముదిరాజ్
మాజీ గ్రేడ్ 1 గ్రంథాలయ డైరెక్టర్ - షాద్‌నగర్,
కట్టమైసమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి.


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
పాఠకులకు, పాత్రికేయులకు, యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొంతం మాధవరెడ్డి
రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు
సిపిఐ - తుర్కయాంజాల్ మున్సిపాలిటీ


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
సుధా బ్యాంక్ సేవలు
సీనియర్ సిటిజన్స్ కు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ 9.50%
డిపాజిట్ల పై వడ్డీ రేట్లు
35 రోజుల నుండి 45 రోజుల వరకు 5.00%
46 రోజుల నుండి 90 రోజుల వరకు 5.50%
91 రోజుల నుండి 180 రోజుల వరకు 6.50%
181 రోజుల నుండి 1 సం॥ వరకు 7.50%
1 సం॥ పైబడి 2 సం॥ల వరకు 8.50%
2 సం॥ పైబడి 3 సం॥ల వరకు 8.75%
3 సం॥ పైబడి 5సం॥ల వరకు 9.00%
5 సం॥ పైబడి 8.00%
అన్ని డిపాజిట్ స్లాబ్స్‌పై సీనియర్ సిటిజన్స్‌కు అదనంగా 0.50%
రూ॥ 5లక్షల డిపాజిట్ వరకు DICGC వారి ఇన్సూరెన్స్ సౌకర్యం కలదు
ఫిక్స్‌డ్ డిపాజిట్/ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు.
అతి తక్కువ అద్దెపై లాకర్ సౌకర్యం


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు
దసరా, దీపావళి శుభాకాంక్షలు
మండల ప్రజలకు, అధికారులకు, బంధుమిత్రులకు,
శ్రేయోభిలాషులకు
విజయ దశమి శుభాకాంక్షలు
తిరుమల ఎం.పి.డి.ఒ. మోర్తాడ్
శ్రీధర్ ఎం.పి.ఒ. మోర్తాడ్
మహిపాల్ పంచాయతి కార్యదర్శి తిమ్మాపూర్
శ్రీకాంత్ పంచాయతి కార్యదర్శి వడ్యాట్
సంతోష్ పంచాయతి కార్యదర్శి పాలెం


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
MERIDIAN SCHOOL & COLLEGE
RESIDENTIAL | SEMI - RESIDENTIAL | DAY SCHOLAR
For Nursery to Class XI (Intermediate)
CBSE AFFILIATION NO: 3630405
SSC 2024 ఫలితాలలో కేవలం 119 మందితో 22 (10) GPA లు సాధించిన ఏకైక విద్యాసంస్థ మెరిడియన్
CLASS AVERAGE 9.4GPA
For every 5 students 1 student got 10 GPA
For every 5 students 1 student got 9.8 GPA
GPA | No. of Students
10 | 22
9.8 | 21
9.7 | 17
9.5 | 10
9.3 | 11
9.2 | 6
9.0 | 14
8.8 | 3
8.7 | 3
8.5 | 4
8.3 | 1
8.2 | 3
8.0 | 2
7.2 | 2
Total | 119
Super - 30 Batch for JEE (MAINS & ADVANCE) & Neet From VI to XI Class
Nursery - XII CBSE
Nursery - X State
Navodaya & Sainik for Class V
VI - X Super 30 NEXTGEN
VI - X Techno NEXTGEN
JEE - Mains & Advance for Classes XI & XII
EAPCET for Classes XI & XII
NEET for Classes XI & XII


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
ఓలింగా!
నూతన్‌కల్ మండల ప్రజలకు,
శ్రేయోభిలాషులకు,
బంధు మిత్రులకు
విజయదశమి శుభాకాంక్షలు
జటంగి గణేష్ యాదవ్
(రైస్ మిల్)


దసరా శుభాకాంక్షలు
పాఠకులకు,
పాత్రికేయులకు,
యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రికకు
7వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
నూనె రాజారత్నం
అసిస్టెంట్ ఇంజనీర్
ఇరిగేషన్ సర్కిల్, నల్లగొండ.


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
పట్టణ ప్రజలు, మిత్రులు, పార్టీ కార్యకర్తలకు, నాయకులు,
అధికారులకు విజయదశమి శుభాకాంక్షలు
"ప్రజాపక్షం" దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జూలకంటి రంగారెడ్డి
మాజీ ఎంఎల్ఎ, మిర్యాలగూడ.
కోడిరెక్క మల్లయ్య
సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు
మిర్యాలగూడ, నల్లగొండ.


ప్రజాపక్షం దిన పత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
Sri Ramachandra HOSPITAL
కోదాడ నియోజకవర్గ ప్రజలకు
విజయదశమి శుభాకాంక్షలు
శ్రీరామచంద్రా మల్టీస్పెషాలిటి హాస్పిటల్
T.G. Govt. Regd.No.300/MEM/2022
జి. రోశమ్మ గారి వీధి, కోదాడ. CELL : 77021 27888, 98482 35692, 77806 01898
డా॥ కోలా యశ్వంత్ కుమార్
MBBS, MD, General Medicine (Osmania)
డయాబెటాలజిస్ట్ &
జనరల్ ఫిజీషియన్
24 గంటలు అందుబాటులో ఉంటారు.
డా॥ డి. శశాంక
M.D., DVL
చర్మ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు
మంగళవారం
మ॥ 3 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు
అందుబాటులో ఉంటారు.
24/7 SERVICES
EMERGENCY & CRITICAL CARE
మేనేజింగ్ డైరెక్టర్స్:
శెట్టి వెంకటేశ్వర్లు, శెట్టి రవికుమార్


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
పాఠకులకు,
పాత్రికేయులకు,
యాజమాన్యానికి,
సిబ్బందికి
"ప్రజాపక్షం"
దినపత్రికకు
7వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
పోగుల సైదులు గౌడ్
మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
బి.సి. విభాగం,
అడ్‌హక్ కమిటీ సభ్యులు
నల్లగొండ జిల్లా పార్లమెంట్.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
నాయకులకు దసరా శుభాకాంక్షలు
తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు
పొందుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న
"ప్రజాపక్షం"దిన పత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ రేవంత్ రెడ్డి గారు
ముఖ్యమంత్రి వర్యులు, తెలంగాణ రాష్ట్రం
కొలన్ వీరేందర్ రెడ్డి
18వ డివిజన్, మాజీ కార్పోరేటర్
నిజాంపేట్ కార్పోరేషన్


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
మిర్యాలగూడ పట్టణ ప్రజలు,
ఉద్యోగులకు వివిధ పార్టీల
నాయకులకు, స్నేహితులు,
బంధు మిత్రులకు
విజయదశమి
శుభాకాంక్షలు
పరికె వెంకటేశ్వర్లు
ఐఎన్‌టియుసి నల్లగొండ జిల్లా
చీఫ్ వైస్ ప్రెసిడెంట్
ఎన్ఎస్‌పిఎల్‌బిసి ఎంప్లాయీస్ వర్కర్స్
యూనియన్ ప్రధాన కార్యదర్శి,
మిర్యాలగూడ.


విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
విజయదశమి (దసరా)
శుభాకాంక్షలు
HAPPY Dussehra
INTER + DEFENCE
INTER + IIT, NEET & EAPCET
DEGREE + DEFENCE
JOIN IN: ARMY, NAVY, AIRFORCE, NDA
COURSES: MPC, BiPC, CEC
KOTHA SATHISH REDDY
M.Sc (Mathematics), B.Ed
Chairman
DELHI DEFENCE ACADEMY A Place for Success
DELHI
JUNIOR COLLEGE
IIT / NEET ACADEMY
DEFENCE ACADEMY
Rekurthi, Kothapally (H), Karimnagar.
Ph: 9550626345, 9553119911, 9063454567


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
వరంగల్ హన్మకొండ జిల్లాలాలోని
ప్రజలకు, ప్రజాప్రతినిధులకు,
స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ
ఉన్నత స్థాయి అధికారులకు,
స్నేహితులకు, శ్రేయోభిలాషులకు,
తోటి సహచర అధికారులకు, సిబ్బందికి
సద్దుల బతుకమ్మ, దసరా
శుభాకాంక్షలు.
పాఠకులకు, పాత్రికేయులకు, యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ మరియు దసరా శుభాకాంక్షలు
దసరా శుభాకాంక్షలు
పాఠకులకు, పాత్రికేయులకు,
యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పోలగాని వెంకటేష్ గౌడ్
రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం
ఉపాధ్యక్షులు, నల్లగొండ జిల్లా.
కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయిన్
చైర్మన్, నల్లగొండ, మిర్యాగూడ.



# జాతీయం ప్రపంచం



## రాష్ట్ర పర్యటనలు వాయిదా వేసుకున్న టివికె చీఫ్ విజయ్



**చెన్నై:** టివికె పార్టీ చీఫ్, సినీ నటుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త పర్యటనలను రెండు వారాల పాటు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో టివికె పార్టీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇటీవల విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41మంది మృతిచెందిన ఘటన తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. తొక్కిసలాట ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన బాధ, దుఃఖం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే రెండు వారాల పాటు బహిరంగ సభ కార్యక్రమాన్ని తాత్కాలికం గా వాయిదా వేస్తున్నాం. పర్యటనలకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను త ర్వాత ప్రకటిస్తామని మా నేత ఆమోదంతో తెలియపరుస్తున్నాం అని పార్టీ హెడ్ సెక్రటేరియట్ ప్రకటించింది.

## ట్రంప్ గాజా శాంతి ప్రణాళిక... ఆక్రమణకు కొత్త ముసుగు

### సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం

**న్యూఢిల్లీ :** గాజా కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన '20 సూత్రాల శాంతి ప్రణాళిక' అస్పష్టత, అత్యంత సందిగ్ధత, వివక్షతతో కూడిన కసరత్తు తప్ప అందులో సదుద్దేశం ఏమీ లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విమర్శించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తరపున బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఇక్కడ ఒక ప్ర కటన విడుదల చేశారు. ట్రంప్ 20 సూత్రాల శాంతి ప్రణాళిక వెస్ట్ బ్యాంక్ గురించి ఏమాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హమని డి.రాజా పేర్కొన్నారు. తాను అందిస్తున్నది శాంతి కోసం తాను ఒక రోడ్ మ్యాప్‌ను అందిస్తున్నానని తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ పాలస్తీనా దేశ హోదా గురించి అతిస్వల్పమైన, అస్పమైన సూచనను మాత్రమే అందిస్తూ పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయెల్ సైనిక ఆధిపత్యంపై తలెత్తే ప్రాథమిక ప్రశ్నను ఏమాత్రం తాకకుండా వదిలేయడం శోచనీయమన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక సంఘర్షణకు మూల కారణాలను పరిష్కరించడానికి బదులుగా, పాలస్తీనా ప్రజల దైనందిన బాధలపై ఏ మా త్రం దృష్టి సారించకుండా, ఇజ్రాయెల్ కనుసన్నలకు అనుగుణంగా ఆక్రమణను నిర్వహించడానికి దోహద పడటం ఆక్షేపణీ యమన్నారు. దురాక్రమణ యుద్ధాలలో తన పా త్రకు అపఖ్యాతిపాలైన టోనీ బ్లెయిర్ వంటి వ్యక్తుల ను శాంతి సంరక్షకులుగా దారుణంగా నూరిపోస్తోందన్నారు. అంతేకాకుండా ఏదైనా చట్ట బద్ధమైన ప్రక్రియను తొలగించే చర్యను నిర్వీ ర్యం చేసేందుకు ఈ శాంతి ప్రణాళిక ఒక సరికొత్త ఎత్తుగడ అని డి.రాజా ధ్వజమెత్తారు. ఇ జ్రాయెల్ ఉ పసంహరణ లేదా అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి విశ్వసనీయమైన యంత్రాంగాన్ని అందించదని, పాలస్తీనియ న్లు రాయితీలు ఇవ్వాలని, నిరాయుధీకరణ చేయాలని డిమాండ్ చేయడం అంతే ప్రమాదకరమైనదని సిపిఐ ఆరోపించింది. తక్షణమే కాల్పుల విరమణ, ఖైదీల విడుదలతో నిజమై న శాంతి ప్రక్రియను వెంటనే ప్రారంభించాల్సి న ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ గట్టిగా నొక్కి చెప్పింది. దశాబ్దాలుగా భూభాగాలపై పె త్త నం కొనసాగిస్తున్న సామ్రాజ్యవాద శక్తులు ఈ ప్రక్రియను నడిపించలేవని, బదులుగా న్యాయమైన ఫలితాన్ని నిర్ధారించడానికి భారతదేశం సహా ప్రపంచంలోని దక్షి ణ దేశాలు ఈ బాధ్యతను చేపట్టాలని సిపిఐ కోరింది. తూ ర్పు జెరూసలేంతో 1967 సరిహద్దులను రాజధానిగా చేసుకుని పూర్తి పాలస్తీనా దేశ హోదాను హామీ ఇవ్వడమే సిపిఐ భావించే నిజమైన పరిష్కారమని, ఇది లేకుండా న్యాయం లేదా శాంతిని తీసుకురాలేమని, గాజా కోసం ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక కొత్త ముసుగులో ఆక్రమణ కొనసాగింపు కోసం మాత్రమేనని సిపిఐ స్పష్టం చేసింది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మూడుశాతం కరువుభత్యం పెంపు

- ఆరు రబీ పంటలకు పెరిగిన మద్దతు ధరలు ● కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు
- దేశమంతటా 'వందేమాతరం' 150వ వార్షిక వేడుకలు ● కేంద్రమంత్రివర్గం నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కరువు భత్యం (డిఎ), కరువు సహాయం (డిఆర్) మూడుశాతం పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనివల్ల 49.19 లక్షలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మరో 68.72 లక్షలమంది పింఛనుదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆరు రబీ పంటలకు 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను కనీస మద్దతు ధర పెంచుతూ మరో నిర్ణయం తీసుకుంది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు వీలుగా రూ.11,440 కోట్లతో ఆరు సంవత్సరాల పథకాన్ని ఆమోదించింది. కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలను దేశంలో ఏర్పాటు చేస్తారు. బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 సంవత్సరాలు (1876) పూర్తవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వార్షికోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మొత్తం ఆరు కీలక తీర్మానాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించినట్లు సమాచార,ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇప్పటివరకూ కేంద్ర ఉద్యోగులకు 55 శాతంగా ఉన్న డి ఎ ఇక మీదట 58 శాతానికి పెరుగుతుంది. దీనివల్ల కోశాగారంపై ఏటా రూ.10,083.96 కోట్ల భారం పెరుగుతుంది. దీపావళి కానుకగా కేంద్రమంత్రివర్గం బుధవారంనాటి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏడవ వేతన కమిషన్ సిఫార్సులను సమ్మతించిన సూత్రాల ప్రాతిపదికపై డిఎ పెంపు నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి చెప్పారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు కరువుభత్యం, కరువుసహాయాలను సవరిస్తుంది. వస్తుసేవల పన్నులో రెండో తరం సంస్కరణలు గతనెల 22వ తేదీ నుండీ అమలులోకి తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం వినియోగ వ్యయాలకు మరింత బలం చేకూర్చేదిశగా పండుగవేళ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలనే ఎంపిక చేసిన 10.91 లక్షలమంది ఎంపిక చేసిన రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకతతో ముడిపడిన 78 రోజుల బోనస్ ప్రకటించింది. జిఎస్‌టిలో రెండు అంచెల పన్నులవల్ల దేశంలో భారీగా కొనుగోళ్ళు పెరుగుతాయని, చిన్నసూక్ష్మ,మధ్యతరహా పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న మోదీ ప్రభుత్వం ఈ వరుస నిర్ణయాలు ప్రకటిస్తోంది.



### క్వింటాలు గోధుమకు రూ.2,585లు మద్దతు ధర

ఆరు రబీ పంటలకు మద్దతు ధరలు (ఎంఎస్‌పి) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పప్పుధాన్యాల స్వయంసమృద్ధికి ఆరు సంవత్సరాల పథకాన్ని ఆమోదించింది. కాగా క్వింటాలు గోధుమలకు మద్దతు ధర రూ.2,585 కు పెంచారు. ఈ ధర 2026–27 మార్కెట్ సంవత్సరం నుండి అమలులోకి వస్తుంది. మొత్తంగా ఈ ధర 6.59 శాతానికి పెరిగింది. గత ఏడాది ఈ ధర రూ.2,425లుగా ఉంది. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) సిఫార్సుల ప్రాతిపదికపై ఆరు రబీ పంటలకు ఎంఎస్‌పి పెంచినట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. కుసుమ పంటకు క్వింటాలుకు రూ.600 ధర నిర్ణయించారు. పెసలు క్వింటాలు ధర రూ.300, కందులు,ఆవాలుకు క్వింటాలు ధర రూ.250లు, అపర ధాన్యాలకు క్వింటాలు ధర రూ.255లు, బార్లీకి రూ.170లు, గోధుమకు రూ.160లు క్వింటాలు ధర పెంచారు. బార్లీకి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.1,980 నుండి రూ.2,150లుకు పెరిగింది. కీలకమైన రబీ పప్పు ధాన్యాలకు మద్దతు ధరలను క్వింటాలుకు రూ.5,650 నుండి రూ. 5,875లకు పెంచారు. సగటున దేశంలో గోధుమ ఉత్పత్తి ఖర్చు 109 శాతంగా ఉంటుందని అంచనా. గోధుమకు 93 శాతంగా ఉంటుంది. అదే విధంగా పప్పుధాన్యాల పంటల ఉత్పత్తిలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిదేశంగా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఆరు సంవత్సరాలపాటు అమలుచేసేవిధంగా ఒక పథకాన్ని ఆమోదించింది. దీనికోసం రూ.11,440 కోట్లు కేటాయించారు. ''పప్పుధాన్యాల ఉత్పత్తికి మిషన్ ఆత్మనిర్భర్'' పేరుతో ఈ పథకం అమలు చేస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుండి 2030–31 ఆర్థిక సంవత్సరం వరకూ ఈ పథకాన్ని అమలు చేస్తారు. కందులు, మినుములు వంటి పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని కేంద్రం నిర్ణయించింది.

### కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు

దేశంలో కొత్తగా మరో 57 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల 86,000 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. కేంద్ర హోంశాఖ, రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఈ ఖర్చు పంచుకుంటాయి. మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.5,862.55 కోట్లు ఖర్చు చేస్తారు. 2026–27 ఆర్థిక సంవత్సరం నుండి తొమ్మిది సంవత్సరాలపాటు వీటి ఏర్పాట్లు జరుగుతాయి. ఇందులో మూలధనం రూ. 2,585.52 కోట్లు కాగా, నిర్వహణా వ్యయం రూ.3,277.03 కోట్లుగా అంచనావేశారు. 1962లో ఈ కేంద్రీయ విద్యాలయ విధానం అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 1,288 కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో మాస్కో, ఖాట్మండు, టెహ్రాన్ దేశాలలో కూడా మూడు కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తున్నాయి. ఈ విద్యాలయాలలో మొత్తం 13.62 లక్షలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా, 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వార్షికోత్సవాలు జరపాలని కూడా కేంద్రం నిర్ణయించింది. బంకించంద్ర ఛటర్జీ సంస్కృతంగా ఈ గీతాన్ని రచించారు. ఈ గీతానికి జాతీయ గీతం 'జనగణమన...'తో సమాన హోదా ఉంది. కాగా అసోం రాష్ట్రంలోని జాతీయ రహదారి–715లో కలియాబోర్–నుమలిగర్ సెక్షన్‌ను వెడల్పు చేసేందుకు రూ.6,957 కోట్లు కేంద్రం కేటాయించింది. ప్రస్తుతం ఈ జాతీయ రహదారి (పాత ఎన్‌హెచ్–37) రెండు రాకపోకల మార్గం చాలా రద్దీగా మారింది. దీనిని వెడల్పు చేస్తారు.

## రెండవసారీ యథాతథం

- వడ్డీరేట్లపై ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టీకరణ ● త్వరలోనే సడలింపులుఉంటాయని సంకేతాలు



**ముంబయి :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)వరుసగా రెండవసారి వడ్డీరేట్లను ఏ మాత్రం మార్పుచేయకుండా యథాతథంగా ఉంచింది.అమెరికా సుంకాల ప్రభావం, మునుపటి రేటు తగ్గింపు, ఇటీవల పన్ను తగ్గింపుల ప్రభావంపై మరింత స్పష్టత కోసం వేచి ఉన్న కారణంగా తన కీలక వడ్డీరేట్లలో మార్పు ఉండదని బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. అయితే అమెరికా సుంకాల నుండి ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి రాబోయే నెలల్లో సడలింపులకు అవకాశం ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంకేతాలు ఇచ్చారు. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ తిరిగి కొనుగోలు రేటును 5.5శాతం వద్ద మార్చకుండా ఉంచడానికి ఏకగ్రీవంగా ఓటువేసింది. భవిష్యత్తులో అవసరమైతే రెండు దిశలలోనై వెళ్లడానికి వెసులుబాటును ఇస్తూ 'తటస్థ' విధాన వైఖరిని కొనసాగించాలని నిర్ణయించింది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ నేతృత్వంలోని సగంమంది బాహ్య నిపుణులతో కూడిన రేట్ సెట్టింగ్ ప్యానెల్, ఆగస్టులో జరిగిన మునుపటి త్రైమాసిక సమీక్ష సమావేశంలో విరామం తీసుకునే ముందు ఈ సంవత్సరం మొత్తం 100 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్లను తగ్గించింది. 'విధాన చర్యల ప్రభావం, తదుపరి కోర్సును రూపొందించే ముందు మరింత స్పష్టత వెలువడటానికి రేట్లను ఉంచడం వివేకం' అని మల్హోత్రా అన్నారు.'ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితులు, అంచనాల వృద్ధికి మరింత మద్దతు ఇవ్వడానికి విధానపరమైన అవకాశాలను తెరిచాయి' అని ఎంపిసి నిర్ణయాలను ప్రకటిస్తూ మల్హోత్రా చెప్పారు. అయితే ముందస్తు ద్రవ్యవ విధాన చర్యలు ఇటీవల ఆర్థిక చర్యల ప్రభావం ఇంకా కొనసాగుతోందని ఎంపిసి గుర్తించింది. అలాగే,వ వాణిజ్య సంబంధి త అనిశ్చితులు బయటపడుతున్నాయని, భారతదేశం నుంచి దిగుమతులపై అమెరికా 50శాతం సుంకం విధించడంతోపాటు హెచ్1బి వీసా నిబంధనలు కఠినతరం చేయడాన్ని ఆయన ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఈ సంవత్సరం ఆసియాలో అ త్యంత దారుణంగా పనితీరు కనబరిచిన కరెన్సీ అయిన రూపాయి డాలర్‌తో పోలిస్తే 0.1 శాతం పెరిగి 88.70కి చేరుకుంది.అదే సమయంలో స్టాక్‌లు అత్యధికంగా ట్రేడ్ అ య్యాయి. వడ్డీరేట్లను నిలుపుకోవడంలో ఆర్‌బిఐ పోటీ ప్రాధాన్యతలను సమతుల్యం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. ఒకవైపు అమెరికా సుంకాల నుం డి అణిచివేసిన ద్రవ్యోల్బణం, వృద్ధి ప్రమాదాలు మరోపక్క రూపాయి పతనం. బలహీనమైన బాహ్య డిమాండ్ ఉన్నప్పటికీ దేశీయ చోదకుల మద్దతు, వృద్ధి అంచనా స్థిరంగా ఉందని మల్హోత్రా చెప్పారు. 'అనుకూల రుతుపవనాలు, తక్కువ ద్రవ్యోల్బణం, ద్రవ్య సడలింపు, ఇటీవలి జిఎస్‌టి సంస్కరణల సానుకూల ప్రభావం నుండి దీనికి మరింత మద్దతు లభించే అవకాశం ఉంది.' వృద్ధి ఇప్పటికీ ఆకాంక్షల కంటే తక్కువగానే కొనసాగుతోంది. జూన్ మూడు మా సాలలో భారతదేశ జిడిపి 7.8శాతం పెరిగింది' ఇది ఒక సంవత్సరంలోఏ అత్యంత వేగవంతమైన వేగంగా భావించవచ్చు. ఆర్‌బిఐ కూడా ఈ సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 2శాతానికి త గ్గించింది. ఇది సహన పరిమితి 4శాతం కంటే చాలా తక్కువే అని చెప్పాలి. ఇది గతంలో ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం దాదాపు 3.1శాతం ఉంటుందని అంచనా వేసింది. విదేశీ మారక ద్రవ్య నియమాల సడలింపు, ఇన్‌ఫ్రా ఫైనాన్సింగ్, నూతన విశ్వ లైసెన్సింగ్ డ్రాఫ్ట్స్, రూపాయి అంతర్జాతీయాకరణ, వాటాలపై రుణ పరిమితులను సడలించడం, ఇతర ఆర్థిక సాధనాల మధ్య క్రెడిట్ వృద్ధిని పెంచే చర్యలను మల్హోత్రా ప్రకటించారు. మొత్తం మీద ఈ విధానం ఇతర చర్యల ద్వారా వృద్ధి మద్దతు ఇవ్వడానికి బలమైన ధోరణిని కలిగి ఉంది. అదేసమయంలో రేటు కోత లు త్వరలో జరుగుతాయని పేర్కొంది. కోటక్ మహీంద్రా ముఖ్య ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ మాట్లాడుతూ అంచనాలకు అనుగుణంగా ఎంపిసి ఒక సానుకూల రేటు, వైఖరిని అందించిందన్నారు.

## గాజాలో దారుణాలపై మోదీ మౌనం పూర్తిగా ద్రోహం

### ట్రంప్ ప్రణాళికపై కలవరపెట్టే ప్రశ్నలు మిగిలే ఉన్నాయ్ : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** గాజాలో జరిగిన భయంకరమైన దారుణాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పూర్తిగా మౌనం పాటిస్తున్నారని, ఇది నైతిక పిరికితనం, పూర్తి ద్రోహం అని కాంగ్రెస్ ఆరోపించింది. తన మంచి స్నేహితుడు అయిన అమెరి కా అధ్యక్షుడు ట్రంప్‌ను శాంతింపజేయడానికి, అతని మరొక స్నేహితుడు నెతన్యాహుకు సంఘీభావంగా ప్రధానమంత్రి మోదీ గాజా కోసం ట్రంప్ కొత్త గా 20 పాయింట్ల ప్రణాళికను స్వాగతించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కానీ ఈ ప్రణాళికపై ప్రాథమిక, కలవరపెట్టే ప్రశ్నలు మిగిలే ఉన్నాయన్నారు. ప్రతిపాదిత పాలనా వ్యవస్థలో గాజా ప్రజలు ఎక్కడ ఉన్నారు? పూర్తి స్థాయి పాలస్తీనా రాజ్యం ఉనికిలోకి రావడాని కి రోడ్ మ్యాప్ ఎక్కడ ఉంది అని నిలదీశారు. యుఎస్, ఇజ్రాయెల్ పాలస్తీనా రాజ్యాన్ని ఎంతకాలం విస్మరిస్తాయని ప్రశ్నించారు. దీనిని ఇప్పటికే ఐక్యరాజ్యసమితిలోని 157 సభ్య దేశాలు గుర్తించాయి, భారతదేశం నవంబర్ 1988లో నాయకత్వం వహించిందన్నారు. గత ఇరవై నెలలుగా గాజాలో జరిగిన మారణహోమానికి జవాబుదారీతనం ఎక్కడ? అని జైరామ్ రమేష్ ఎక్స్ లో పేర్కొన్నారు. గాజాలో వేలాది మంది పౌరుల హత్యకు దారితీసిన భయంకరమైన దారుణాలపై ప్రధానమంత్రి పూర్తి మౌనం వహించారని, ఇది తీవ్రమైన నైతిక పిరికితనమని, పూర్తిగా మోసం చేయడమేనన్నారు. గాజాలో 'దౌర్జన్యాలపై మోదీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది.

## ఇండోనేసియా స్కూలు శిథిలాల్లో 91 మంది పిల్లలు!



**జావా:** ఇండోనేసియాలోని ఒక స్కూలు భవంతి కుప్పకూలిపోయిన శిథిలాల్లో దాదాపు 91 మంది విద్యార్థులు చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. తూర్పుజావా పట్టణం సిడోయార్జోలోని అల్ ఖొజినీ ఇస్లామిక్ బోర్డింగ్ స్కూలు కుప్పకూలిపోవడంతో రెండు రోజులుగా ఈ ప్రాంతంలో సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి. భారీ క్రేన్లు, తవ్వకం యంత్రాలను అక్కడికి రప్పించారు. శిథిలాల్లో ఉన్నవారిని కాపాడేందుకు సహాయ బృందాలు లోనికి ఆక్సిజన్ సరఫరా చేస్తున్నాయి. ఈ స్కూలులో చదువుతున్నవారంతా 12– 17 వయసుగల విద్యార్థినీ విద్యార్థులే. సోమవారం సాయంత్రం ఈ స్కూలు భవనం కుప్పకూలిపోయింది. ఆ భవనంలో ఎక్కువమంది టీనేజ్ విద్యార్థులే ఉన్నారు. ఈ ప్రమాదంలో ప్రాథమికగా ముగ్గురు మరణించారని మంగళవారం అధికారులు చెప్పారు. మరో 99 మంది గాయపడ్డారు. వందలసంఖ్యలో విద్యార్థులు మరణించాల్సిన పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఒకవైపు భవంతి కూలిపోయిన సమయంలో అక్కడ చదువుకునే బాలికలు అనేకమంది కొంచెం దూరంగా ఉన్న గ్రౌండ్‌లో ప్రార్థనా కార్యక్రమంలో నిమగ్నమై ఉండటంవల్ల ఆ బాలికలందరూ ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. ఇప్పటికే రెండు అంతస్తులో ఉన్న ఈ స్కూలు భవనం మరో రెండు అంతస్తులను భరించడానికి ఎంతమాత్రం బలంగా లేదు. పునాదులు బలహీనంగా ఉన్న కారణంగా స్కూలు భవనం కుప్పకూలిపోయింది.

## డి.ఆర్.కాంగో మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబిలకు ఉరిశిక్ష



కిన్షాసా: ఆఫ్రికా దేశం డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబిల (55)కు ఆ దేశ మిలిటరీ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఆయనను న్యాయస్థానం దేశద్రోహిగా ప్రకటించింది. ఐతే ఆయన ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఆయన లేకుండానే మిలిటరీ కోర్టు ఆయనపై ప్రాసిక్యూషన్ మోసిన అభియోగాలను విచారించి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2001 జనవరి 17 నుండి 2019 జనవరి 24 వరకూ ఆయన దేశాధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. తండ్రి లారెంట్ డిజైర్ కబిల హత్యకు గురైన పది రోజుల తర్వాత కాంగో నాలుగో అధ్యక్షుడుగా ఆయన బాధ్యతలు చేపట్టి 19 సంవత్సరాలు దేశాన్ని పాలించారు. తూర్పు కాంగో ప్రాంతంలో పొరుగుదేశం రువాండా సహాయంతో తిరుగుబాటుదారులు బీభత్సం సృష్టించినప్పటికీ మిగిలిన దేశాన్ని స్థిరంగా శాంతియుతంగా పాలించిన ఘటన ఆయనకే దక్కింది. 2011లో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అతి దారుణమైన అవినీతికి పాల్పడ్డారని, మానవ హక్కులను ఉల్లంఘించారని ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. 2016లో ఆయన దేశంలో ఎన్నికలు జరపలేదు. తీవ్ర ఒత్తిడిమధ్య 2018లో ఆయన ఒక ప్రకటన చేస్తూ మూడోసారి దేశాధ్యక్ష పదవికి పోటీ చేయడంలేదని ప్రకటించారు. తర్వాత శాంతియుతంగా మరొకరికి అధికారం బదలాయించారు. ఆయన 138 మిలియన్ డాలర్ల అవినీతిపై 2021లో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.2023లో ఆయన దేశం నుండి అదృశ్యమయ్యారు. ఇప్పటివరకూ కబిల ఎక్కడ ఉన్నారో జాడ తెలియదు.



## సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో భూకంపం

- కుప్పకూలిన భవంతులు : 69 మంది మృతి ● శిథిలాల్లో చిక్కుకున్న పౌరులు



**మనీలా:** ఇటీవల భారీ తుఫాను,వరదలతో అతలాకుతలమైన ఫిలిప్పీన్స్ తీవ్ర భూకంపం బారిన పడింది. బుధవారం సాయంత్రానికి తెలిసిన సమాచారం ప్రకారం ఈ భూకంపంలో 69 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఇంకా అనేకమంది శిథిలాల్లో చిక్కుకున్నారు. సహాయబృందాలు వారిని వెలికితీసేందుకు ఎంతగానో శ్రమపడుతున్నాయి. భారీ యంత్రాలను బోగో నగరానికి తరలించారు. భూగర్భంలో చాలా తక్కువ లోతులో భూకంప కేంద్రం ఉండటంవల్ల భూమి తీవ్రంగా కంపించింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఉపరితల భూమి రెండుగా చీలిపోయి చాలా లోతుకు బీటలువారింది. శతాబ్దాలనాటి చర్చ్‌లు, ప్రభుత్వ భవానాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో అతి శక్తిమంతమైన 'బులోయ్' పెను తుఫాను ఇటీవల దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ తుఫానువల్ల 27 మంది మరణించారు. ఈ కష్టకాలంలో అమెరికా,భారత్, ఆస్ట్రేలియా, జపాన్,యూరోపియన్ యూనియన్ సహా పలు దేశాల నాయకులు,దౌత్యవేత్తలు ఫిలిప్పీన్స్‌కు సంఘీభావం ప్రకటించారు. శిథిలాల్లో సజీవంగా ఉన్న పౌరులను కాపాడేందుకు ఇంకా కొంత గడువు ఉందని, ఈ గోల్డెల్ అవర్స్‌లో వారిని కాపాడాలని స్థానిక పురపాలక ప్రధానాధికారి ఫెర్నార్డో రఫాయిలిటో అలెజాండ్రో చెప్పారు. సెంట్రల్ ఫిలిప్పీన్స్ తీరప్రాంతంలో మంగళవారం రాత్రి పది గంటల సమయంలో సంభవించిన భూకంపంలో పలు భవనాలు కుప్పకూలాయి. జాతీయ రహదారులు రెండుగా చీలిపోయి పొడవాటి గుంటలు ఏర్పడ్డాయి. బోగో సిటీ, సెబూ ప్రాంతాలలో ఎక్కువ నష్టం వాటిల్లిం ది. సెబూ ప్రాంతాన్ని అత్యవసరంగా 'స్టేట్ ఆఫ్ కేలమిటీ'గా ప్రకటించారు. వైద్యులు,నర్సులు, ఇతర సహాయ సిబ్బందిని సెబూ ప్రాంతానికి తరలిరావాలని ప్రభుత్వం ఆదేశించింది. బోగో నగరంలో 90,000 మంది భూ కంపం బారినపడ్డారు. తరిచ్‌టర్ స్కేలుపై భూకంపం 6.9 తీవ్రతగా నమోదైంది. సముద్ర తరంగాలవల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానిక భూభౌతికవిభా గం అధికారులు తొలుత ప్రాథమిక హెచ్చరికలు జారీ చేశారు. సెంట్రల్ ఐలాండ్స్‌లోని లేయ్టే, సెబు, బినిరన్ ప్రాంత నివాసితులను అధికారులు అప్రమత్తం చేశారు. పసిఫిక్ బేసిన్ చుట్టూ అగ్నిపర్వతాలు ఎన్నో ఉన్నాయి. ఈ పసిఫిక్ బేసిన్‌లో వేలాది దీవులు ఉన్నాయి. ఈ దీవులలో జపాన్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా సహా అనేక దేశా లు విస్తరించి ఉన్నాయి. అందువల్ల ఈ అగ్నిపర్వతాలు ఈ ప్రాంత భూగర్భంలో కల్లోలానికి గురవుతూ ఉంటా యి. ఫిలిప్పీన్స్‌లో తాజాగా సంభవించిన భూకంపం బో గో నగరానికి ఈశాన్యంగా 12 మైళ్ళ అతి తక్కువ లోతులో నే సంభవించడంవల్ల జనావాసాలకు తీవ్ర నష్టం కలిగింది.

### ప్రధానమంత్రి మోదీ సంతాపం

ఫిలిప్పీన్స్‌లో భూకంప ప్రమాదంపట్ల భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర సంతాపం ప్రకటించారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికోసం దేశం ప్రార్థనలు చేస్తుందన్నారు. ఈ కష్టకాలంలో ఫిలిప్పీన్స్‌కు భారతదేశం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. ''భూకంపంవల్ల తీవ్ర నష్టం సంభవించి అనేక మంది ప్రజలు మరణించారన్న వార్త విని నేనెంతో ఆవేదన చెందాను, మృతులకు కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను, గాయపడినవారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా, ఈ కష్టకాలంలో భారతదేశం తోడుగా ఉంటుంది'' అని మోదీ పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్‌లో ఉన్న అమెరికా దౌత్యవేత్త మేరీకే కార్ల్‌సన్ ఎక్స్ వేదికగా ప్రకటన చేస్తూ సంఘీభావం ప్రకటించారు. విదేశాల సహాయం ఆశించాలా? వద్దా? అని ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రమాద తీవ్రతను అంచనావేస్తోంది.

## షట్‌డౌన్‌లోకి వెళ్ళిన అమెరికా

### అన్‌పెయిడ్ లీవులో లక్షలమంది ఉద్యోగులు



**వాషింగ్టన్:** అమెరికా కాంగ్రెస్ రెండు కీలక బిల్లులను గడుపులోపు ఆమోదించడంలో విఫలం కావడంతో ఆరు సంవత్సరాల తర్వాత మళ్ళీ మొదటిసారి ఆ దేశం షట్‌డౌన్‌లోకి వెళ్ళింది. అంటే దేశంలో ఉద్యోగులకు వేతనాల చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉంటారు. కానీ వీరికి కూడా వేతనాలు ఉండవు. బిల్లులు ఆమోదం పొందాకే ఈ బకాయిలన్నీ చెల్లిస్తారు. మిగతా ఉద్యోగులంతా వేతనాలు లేకుండా సెలవుల్లో ఉండాలి. ప్రభుత్వం దృష్టిలో అత్యవసరంకాని మిగిలిన సేవలు అన్నీ తాత్కాలికంగా స్తంభించిపోయాయి. కానీ ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. సుమారు 7.50 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు అన్‌పెయిడ్ లీవులోకి వెళ్ళారన్నది ప్రాథమిక అంచనా. బిల్లులు ఆమోదం పొందకపోవడానికి మీరంటే మీరే కారణమని డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పరస్పరం విమర్శించుకుంటున్నారు. బిల్లు ఆమోదం పొందాలంటే 100 మంది సెనేటర్లలో కనీసం 60 మంది అనుకూలంగా ఓటు వేయాలి. అత్యవసరం కాని మిగిలిన లక్షలాదిమంది ఉద్యోగులు ఎలాంటి వేతన చెల్లింపులు లేకుండా సెలవులపై వెళ్ళి ఇళ్ళల్లోనే కూర్చోవాలి. ఈ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతనే తిరిగి వారికి వేతనాలు చెల్లిస్తారు. బిల్లుల ఆమోదం తర్వాతే ఉద్యోగులు అన్‌పెయిడ్ సెలవులు రద్దుచేసుకుని విధుల్లోకి వెళ్ళాల్సి ఉంటుంది. 2018లో ఒకసారి అమెరికా ప్రభుత్వం ఈ విధంగా షట్‌డౌన్‌లోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ ట్రంప్ హయాంలో అదే పరిస్థితి వచ్చింది. సెనేటర్లు చివరి నిమిషంలో రెండు ఫండింగ్ బిల్లులను ఆమోదించే విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఈ లోపు అర్థరాత్రి గడువు ముగిసిపోవడంతో షట్‌డౌన్ ప్రారంభమైంది. అంటే భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటలకు ఈ షట్‌డౌన్‌తో అత్యవసరంలేని కార్యాలయాల మూసివేత మొదలైంది. 1981 నుండీ ఇప్పటివరకూ అమెరికా ప్రభుత్వం 15 సార్లు షట్‌డౌన్ అయ్యింది. ఇందులో 2018లోనే చాలా ఎక్కువగా జనవరి,ఫిబ్రవరి, డిసెంబరు నెలల్లో మూడు సార్లు షట్‌డౌన్ అయ్యింది. 1982లో రెండుసార్లు, 1984లో రెండుసార్లు, 1995లో రెండుసార్లు ఇదేవిధంగా షట్‌డౌన్ అయ్యింది. 2018 డిసెంబరు మొదలైన షట్‌డౌన్ అత్యధికంగా 35 రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఆ తర్వాత 1995 డిసెంబరులో 21 రోజులపాటు షట్‌డౌన్ కొనసాగింది. 2023 సెప్టెంబరులో 16 రోజులు షట్‌డౌన్ అయ్యింది. మిగిలినసమయాల్లో జరిగిన షట్‌డౌన్లు కేవలం ఐదురోజుల వ్యవధిలోలపే ముగిశాయి. ప్రభుత్వ సేవలు స్తంభించి పోవాలని తాను గానీ, రిపబ్లికన్‌పార్టీగానీ కోరుకోవడంలేదని డోనాల్డ్ ట్రంప్ మంగళవారం వైట్‌హౌస్‌లో ప్రకటించారు. షట్‌డౌన్ అవసరం లేదని, కానీ అలాంటి పరిస్థితి వచ్చేట్టు కనిపిస్తోందని, నిజంగా షట్‌డౌన్ అంటూ జరిగితే తాను ఇక వెనక్కు తీసుకోవడానికి అవకాశం లేకుండా తీవ్రమైన కోతలు విధిస్తానని కూడా హెచ్చరిక చేశారు. ఇదంతా డెమోక్రాట్స్‌వల్లే జరుగుతోందని ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డెమోక్రాట్లు–రిపబ్లికన్లు ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్య పరిష్కారం కోసం కృషి చేయడంలేదని, ఒకరినొకరు విమర్శించుకుంటున్నారని వైట్‌హౌస్‌లో జర్నలిస్టులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. మరోవైపు అనేకమంది ఉద్యోగులు స్వచ్ఛందంగా వేతనాలు లేకుండా ఉద్యోగాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ''ఈ షట్‌డౌన్ సమయంలో నేను వేతనం లేకుండా ఉచితంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తా'' అని ఫైర్ ఫైటర్ విలియం క్రైడ్జ్ వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఏడాదికాలం ఎంతో సంతృప్తినిచ్చింది

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటై ఏడాది పూర్తికావడం, ఈ కాలంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా కమిషన్ అనేక కీలక నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం వాటిని పరిగణలోకి తీసుకుని అమలు చేసేందుకు పూనుకోవడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షం లో ఉన్నప్పుడే అధికారంలోకి వస్తే.. తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలుపుకుందన్నారు. కమిషన్ ఏర్పాటు అయిన వెంటనే రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు చాలా జాగ్రతగా ఆలోచన చేసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటి పరిష్కారానికి సైతం చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో ప్రధానంగా విత్తనోత్పత్తి రైతులను మోసం చేసిన విత్తన కంపెనీల నుంచి ఆ రైతులకు నష్ట పరిహారం అందేలా చేయడంతో పాటు శాశ్వతంగా ఇలాంటి సమస్యల పరిష్కారానికి గాను విత్తనం చట్టం అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఇందుకు ప్రభుత్వం సైతం వెంటనే బిల్లు ముసాయిదా రూపకల్పనకు కమిటీ ఏర్పాటు చేసిందని కోదండరెడ్డి గుర్తు చేశారు.

## టివివిపి ఆసుపత్రుల్లో కార్మికుల సంఖ్యను తగ్గిస్తే సమ్మెకు వెనకాడబోం



ఎఐటియుసి హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్ : టివివిపి ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు తగ్గించి విడుదల చేయడం అన్యాయమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహాలు అన్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లు కలిసి కార్మికుల వేతనాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇదే జరిగితే సమ్మెకు సైతం వెనకడబోమని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారంటివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు ఎండి యూసుఫ్, నరసింహాలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం టెండర్ పిలిసి కార్మికులను డ్యూటీలు చేయించుకోవడం జరుగుతున్నదని టెండర్ కాల పరిమితి ముగిసిన నేటికీ అదే టెండర్లతో ప్రభుత్వం పనులు చేయించుకుంటుదన్నారు. కాంట్రాక్టర్లు నాటి నుండి నేటి వరకు కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారని, తక్షణమే కొత్త టెండర్లను పిలవడంతో పాటు కార్మికుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మెకు సైతం వెనకబోమని వారు కమిషనర్‌కు వివరించారు. అదేవిధంగా ఎక్కడైనా కార్మికుల సంఖ్యను తగ్గించాల్సి వస్తే మూడు నెలల ముందు సమాచారం నోటీసు రూపంలో ఇవ్వాలని అలాంటిది పాటించకుండా ఆరు నెలలు పనులు చేయించుకుని ప్రస్తుతం జీతాలు ఎగ్గొట్టేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు ప్రయత్నించడం తీవ్ర అక్షేపనీయమన్నారు. ఇప్పటికే ఆసుపత్రుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా భావించాల్సి వస్తున్నదని వారు పేర్కొన్నారు.

**టీవి విపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ వివరణ**

ఈ అంశంపై టీవి విపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రికనబల్ బెడ్ స్ట్రెంత్‌ను పంపించడం జరిగిందని తద్వార్ల బెడ్ల సంఖ్యను తగ్గించినందువలన కార్మికులను తగ్గించాల్సి వస్తుందని వివరణ ఇచ్చారు. మరొక మారి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో మాట్లాడి బెడ్ల సంఖ్యను పెంచి కార్మికులను తగ్గించకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తామని ఆయన యూనియన్ నాయకులకు హామి ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు కమిషనర్ కార్యాలయానికి రికనబుల్ బెడ్‌స్ట్రెంత్‌ను మరొకసారి లెక్కించి అందజేయాల్సిందిగా కోరుతామన్నారు.

## గాజా స్వాధీనానికి ట్రంప్, నెతన్యాహుల కుట్రలు ఫలించవు

వి.ఎస్.బోస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : హమాస్ సంస్థ చర్యలను అడ్డుపెట్టుకొని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ నేత నెతన్యాహుతో కలిసి గాజాను స్వాధీనం చేసుకోవాలనే కుట్రలను ప్రపంచంలోని అభ్యుదయవాదులు ఖండించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. ట్రంప్ ప్రకటించిన 20 అంశాలలో పాలిస్తీనా దేశ సమస్య లేదని, నెతన్యాహు స్వతంత్ర పాలస్తీనాకు వ్యతిరేకిస్తున్నాని ట్రంప్ సమక్షంలో చెప్పటంతో దాగివున్న కుట్ర తెలుస్తుందన్నారు. హమాస్ బంధించిన ఇజ్రాయిల్ పౌరులను విడుదల చేయమని అడగటం సమంజసమైన ప్రతిపాదన కానీ, వారు కోరుకుంటున్న పాలస్తీనాకు పరిష్కారం చూపించకుండా ట్రంప్ ఏలాంటి ప్రతిపాదన చేసినా అది ఫలవంతం కాదన్నారు. గాజాను అమెరికా ఆధీనంలోకి తీసుకోవటం, హమాస్ నాయకులను ఓపెన్ జైలులో ఉంచినట్లుగా ట్రంప్ చేసిన ప్రతిపాదనలో అసలు విషయమన్నారు. ప్రపంచ ప్రజలు ఈ దుర్మార్గపు ఆలోచనను సహించబోరని, పాలస్తీనా ప్రజలకు స్వతంత్ర దేశం కావాలని ఆకాంక్షను ప్రజ లు, ఐక్యరాజ్య సమితి ముక్తకంఠంతో బలపరుస్తోందన్నారు. తక్షణమే ట్రంప్, నెతన్యాహు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ కుట్రలు మానుకొని నిజమైన శాంతి కోసం ప్రయత్నించాలని లేకపోతే చరిత్రలో నియంతలకు పట్టిన గతే వీరికి పడుతుందని బోస్ హెచ్చరించారు.

## తగ్గిన రైతు ఆత్మహత్యలు..

2014లో 1347...2023లో 56 మంది : హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 2014లో 1347 రైతు ఆత్మహత్యలు నమోదవ్వగా, ఆ సంఖ్య 2023 నాటికి 56కు తగ్గిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 2023లో దేశవ్యాప్తంగా 10,786 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా ఇందులో తెలంగాణ వాటా కేవలం 0.51 శాతంగా ఉన్నదన్నారు. జాతీయ నేర గణాంక నివేదిక (ఎన్ఆర్‌సిబి )లెక్కలు కాంగ్రెస్ నాయకులకు చెంపపెట్టులాంటిదని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం నేడు 14వ స్థానికి పరిమితమైందని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో 95.84% తగ్గిందని వివరించారు. స్వరాష్ట్రంలో ఒక్కో పథకంతో వ్యవసాయరంగానికి జీవం పోశారని, సాగును బాగు చేశారని, రుణమాఫీతో రైతన్నకు ధీమా దొరికిందని, 'రైతు బంధు' రైతులకు బంధువుగా మారిందని, రైతు బీమా కొండంత భరోసాను ఇచ్చిందని వివరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిపిఐ(ఎం) సన్నద్ధం : జాన్ వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తామకు బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీకి సన్నద్ధం అవుతున్నట్లు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో సర్దుబాటు, కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై ఈనెల 4వ తేదీన జరగనున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని ఓడిరచడమే తమ రాజకీయ కర్తవ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు బిజెపి అడ్డుపడిందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, యూరియాను ఇవ్వడం లేదని చెప్పారు.

**ఏజెన్సీ ప్రాంత జెడ్పీ చైర్మన్ స్థానాలు ఎస్‌టిలకే కేటాయించాలి**

స్థానికసంస్థల ఎన్నికల్లో ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు రిజర్వేషన్ అమలు చేయొద్దంటూ నిబంధనలున్నాయని, గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మెన్ స్థానాలకు ఎస్‌టిలకే రిజర్వేషన్ ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జెడ్పీ చైర్మెన్ స్థానాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం సరైంది కాదని చెప్పారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న జెడ్పీ చైర్మెన్ స్థానాలను ఎస్టీ రిజర్వేషన్ కొనసాగించేలా ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

డిజిపిగా బాధ్యతలు స్వీకరణ

లొంగిపోయిన మావోయిస్టులకు వేధింపులు ఉండవని పిలుపు





ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతారణంలో సజావుగా నిర్వహిస్తామని డిజిపి బి.శివధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో బుధవారం ఆయన డిజిపిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల తమకు ఛాలెంజ్‌గా నిలిచాయన్నారు. ప్రస్తుతం తమ దృష్టి ఈ ఎన్నికలపైనే కేంద్రీకరించామని అందుకు సంబంధించిన బందోబస్తుతో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తనకు డిజిపిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం ముందున్న బాధ్యత అని అన్నారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఎలాంటి వేధింపులు ఉండవని, అన్ని రకాలుగా అండగా ఉంటామని అన్నారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధంగా ఉన్నామని ఇటీవల మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడే లేఖ రాశారని తెలిపారు. రష్యా, చైనాలో ఉన్న పరిస్థితులు భారత దేశంలో ఉన్న పరిస్థితులు వేరని వాటిని ఇన్నాళ్లు గుడ్డిగా అవలంభించామని ఇక పోరాటాన్ని ఆపేస్తామని అందులో పేర్కొన్నారని అన్నారు. అందువల్ల మావోయిస్టు సిద్ధాంతాలు ఆచరణలో విఫలం అయ్యాయని తాము భావిస్తున్నామన్నారు. ఇకనైనా మావోయిస్టులు అజ్ఞాతం వీడి ప్రజల్లోకి రావాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇటీవల కేంద్ర కమిటీ సభ్యురాలుగా ఉన్న సుజాత కూడా లొంగిపోయిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో మావోల ప్రభావం లేదని వాళ్లతో ఇంకా చర్చలు జరపాల్సిన అవసరం ఏ ఉందని తెలిపారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొంత మావోల అలికిడి ఉందని రాష్ట్రంలోకి ప్రవేశించడం లేదని తెలిపారు. ఛత్తీస్గఢ రాష్ట్రాలకు చెందిన మావోయిస్ట్ సానుభూతి పరులు మన దగ్గర లొంగిపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో స్వాతిలక్రా, అదనపు డిజిపి మహేష్‌కుమార్ భగవత్, సీనియర్ ఐపిఎస్ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, విసి సజ్జనార్, సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, సుమతి, తఫ్సీర్ ఎక్బాల్, రమేష్‌రెడ్డి, చారుసిన్హా, చింతమనేని శ్రీనివాస్, వివి శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు.

**శివధర్‌రెడ్డి నేపథ్యం..**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుండ్ల గ్రామంలో జన్మించిన బి.శివధర్‌రెడ్డి 1994లో ఐపిఎస్‌గా ఎంపికయ్యారు. ఆ తరువాత అదనపు ఎస్‌పిగా విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లి, గ్రేహౌండ్స్, బెల్లంపల్లిలో పనిచేశారు. ఎస్‌పిగా నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు, హైదరాబాద్ ట్రాఫిక్, సౌత్‌జోన్, ఎస్ఐబిలో విధులు నిర్వహించారు. డిఐజిగా ఎస్ఐబి, ఎసిబిలో, ఐజిపిగా పదోన్నతి పొందిన తరువాత ఎసిబి, విశాఖపట్నం కమిషనర్‌గా, ఐపిజి పర్సనల్, అదనపు డిజిపి హోదాలో రైల్వే, రోడ్డు సేఫ్టీ, ఇంటెలిజెన్స్, డిజిగా ఇంటెలిజెన్స్ పనిచేసిన ఆయన ప్రస్తుతం డిజిపిగా పనిచేస్తున్నారు. 2002లో ఆయనకు గ్యాలంటరీ అవార్డు, 2003లో అంతరిక్ సురక్షా సేవా పతకం, యూనైటెడ్ నేషన్స్ పోలీసు మెడల్, 2011లో ఐపిఎం మెడల్, 2018లో అసాధరణ ఆసుచన కుషాల్తా పదక్, 2021లో ఎటిఐ ఉత్రిక్షిత్ పదక్ సాధించారు.

**గవర్నర్, సిఎం, సిఎస్‌లను కలిసిన డిజిపి**

తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా భాదత్యలు చేపట్టిన బి.శివధర్ రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌ను వెళ్లి మర్యాదపూర్వకంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. ఆ తరువాత బంజారాహిల్స్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సిఎం ఆయన్ని అభినందించారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో పాటు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డిజి రవిగుప్తాను వేరు వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

# బిసిలకు ఈటల రాజేందర్, బిజెపి క్షమాపణ చెప్పాలి

రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తారా? లేదా? : కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లవద్దని, ఒక వేళ ఫలితాలు వచ్చినా, న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిని రద్దు చేయిస్తామని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించడం దుర్మార్గమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దుయ్యబట్టారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలు గెలువడం బిజెపికి, ఈటల రాజేందర్‌కు ఇష్టం లేదా? అని నిలదీశారు. బిసిలను బ్లాక్ మెయిలింగ్ చేసే పద్ధతిలో మాట్లాడిన ఈటల రాజేందర్, బిజెపి వెంటనే బిసిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ల బిల్లులను ఆమోదిస్తారా?, లేదా స్పష్టం చేయాలని ఆమె బిజెపిని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్, బిజెపి ఏమైనా న్యాయస్థానాలా? లేదా వారే జడ్జీలా అని ప్రశ్నించారు. బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లను ఇవ్వాల్సిన కేంద్రంలో అధికార బిజెపినే కోర్టుకు వెళ్లి ఎన్నికను రద్దు చేయిస్తామనడం ద్రోహపూరితమన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి రిజర్వేషన్ల జిఒను స్వాగతిస్తే, ఈటల మాత్రం భిన్నంగా మాట్లాడుతారని, బిసి రిజర్వేషన్లపైన ఆ పార్టీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంపిలు ఢిల్లీలోని ప్రధాని మోదీ కాళ్లు పట్టుకోని రిజర్వేషన్లు అమలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల ప్రక్రియ తప్పులతడకగా ఉన్నదని, ఎస్‌సిలు, ఎస్‌టిలు లేని వద్ద ఎస్‌సిలకు, ఎస్‌టిలకు రిజర్వేషన్లను కేటాయించారని, మరోవైపు ఎస్‌సి వర్గీకరణ స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో కనిపించలేదని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మరోను పల్లిని ఎస్‌టి రిజర్వేషన్ కేటాయించారని, గతంలో కూడా ఈ గ్రామాన్ని ఎస్‌టిగా కేటాయించినప్పటికీ ఆ గ్రామంలో ఎస్‌టిలు లేకపోవడంతో సర్పంచ్ ఎన్నికలు జరగలేదని, ఈసారి కూడా ఎస్‌టి రిజర్వేషన్‌ను కేటాయించారని కవిత గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపిపైన ఒత్తిడి తీసుకొచ్చి బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే విధంగా పోరాటం చేయాలని, ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చును కదా అని కవిత ప్రశ్నించారు.ఈ నెల 8న కోర్టు తీర్పు వచ్చిన తర్వాత తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. బిఆర్ఎస్‌కు, తనకు ఇచ్చిపుచ్చుకునేది ఏమీ లేదని, (లేన్‌దేన్) హామీలపైన పోరాటం చేస్తున్న బిఆర్ఎస్, బిసిల అంశాన్ని కూడా ప్రస్తావించాలని కవిత సూచించారు.

## బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగం అన్ని అంశాలలో బిసిలకు రిజర్వేషన్లు అమలు కావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. బిసిలు తమ హక్కుల సాధన కోసం అంత ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కామారెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. బిసిలను కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని, కోర్టులో పిటీషన్ దాఖలు చేశారన్నారు. అసెంబ్లీలో బిసి బిల్లును బిజెపి, బిఆర్ఎస్ మద్దతు తెలుపుతాయని, బయట ధర్నాలు చేస్తాయన్నారు. ఈనెల 8న హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో అందరూ కూడా బయటకు రావాలని, 42 శాతం రిజర్వేషన్ల కోసం బిసిలు బయటకు రాకపోతే భవిష్యత్తు లో ఇలాంటి అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావని హనుమంతరావు తెలిపారు.

## నేడు, రేపు తెలంగాణలో భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింత బలపడి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, గురువారం తెల్లవారుజామున వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 3న దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాల మధ్య తీరం దాటుతుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం, శుక్రవారం, శనివారం, ఆదివారం తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించారు. ఆదిలాబాద్, కుమ్రం భీంఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

**హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం**

హైదరాబాద్ నగరంలో బుధవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, బేగంపేట్, పంజాగుట్ట, కొండాపూర్, మాదాపూర్, మెహిదీపట్నం, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపూల్, బాగ్ అంబర్‌పేట్, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, ముషీరాబాద్, విద్యానగర్, రాంనగర్, ఉస్మానియా యూనివర్సిటీ, బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి, ఆర్‌టిసి క్రాస్ రోడ్ గాంధీ నగర్, జవహర్ నగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, చంపాపేట్, మలక్‌పేట్, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

## సిఎం దసరా శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని సిఎం గుర్తు చేశారు. తెలంగాణ అప్రతిహత విజయాలతో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలతో ఈ పండుగ జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆ దుర్గామాతను ప్రార్థించారని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది.

## కెసిఆర్ విజయదశమి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: కార్యదీక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అసలు విజయం అనే స్ఫూర్తిని 'దసరా పండుగ' మనకు అందిస్తుందని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. దసరా పండుగ (అక్టోబర్ 2) సందర్భంగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయ దశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నదని, అదే స్ఫూర్తితో పదేళ్ల పాలనలో ప్రజలను ప్రగతి విజయాల దిశగా నడిపించామని కెసిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని ఆకాంక్షించారు. తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని, నిత్య శుభాలతో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా దీవించాలని దుర్గా మాతను కెసిఆర్ ప్రార్థించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా.. విజయ దశమిగా జరుపుకునే దసరా పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉన్నదని అన్నారు.

## ధర్మం గెలిచిన రోజు : టిపిసిసి చీఫ్

విజయదశమి పండుగ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అధర్మంపై ధర్మం గెలిచిన రోజుగా దసరా ప్రత్యేకతను కలిగివుందని ఆయన పేర్కొన్నారు. విజయదశమి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం నింపాలని, సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించాలని, అభివృద్ధి, ఆరోగ్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

## కాంగ్రెస్‌ది.. సర్కస్: కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇది కాంగ్రెస్ సర్కారు కాదని,సర్కస్ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు ఎద్దేవా చేశారు. సొంత పార్టీ ఎంఎల్‌ఎలే రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మడం లేదని ఆయన తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతులేని అరాచకత్వం, అపరిమితమైన అజ్ఞానం రాజ్యమేలుతున్నదన్నారు. తన నియోజకవర్గంలో వరదలు వస్తే ప్రజలకు సహాయం చేయాలని ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఎల్లారెడ్డి ఉత్తరం రాశారని, పరిశ్రమనే తగలబెడతానని బెదిరించి జడ్చర్ల కాంగ్రెస్ ఎంఎల్‌ఎ రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు.

## గెలిచే యత్నం

(మూడవ పేజీ తరువాయి)



తెలిపారు. ముగింపు ఉత్సవాల నిర్వహణ ఆహ్వాన కమిటీ సమావేశం అక్టోబర్ 5వ తేదీన ఖమ్మంలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల సిపిఐ కార్యదర్శులు కూడా పాల్గొనున్నారని పల్లా వెంకట రెడ్డి చెప్పారు.

**బిజెపిది లూటీకోర్ ప్రభుత్వం : డాక్టర్ నారాయణ**

దేశంలోని కొంతమంది కార్పొరేట్ ఆర్థిక నేరగాళ్లు రూ.16 లక్షల కోట్ల దేశ సంపదను కొల్లగొట్టి విదేశాలకు పారిపోతే, కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వం గడిచిన పదేళ్లలో జిఎస్‌టి పేరుతో రూ.15 లక్షల ప్రజల ధనాన్ని లూటీ చేసిందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అదే బిజెపి నాయకులు ఇప్పుడు జిఎస్‌టి తగ్గింపు పేరుతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేల అదా చేస్తున్నామని నీతులు చెబుతున్నారని, బిహార్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఈ నాటకాలని ఆయన విమర్శించారు. బిహార్‌లో బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమి సర్వశక్తులను ఒడ్డనుందని చెప్పారు.



లద్దాఖ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నేర్చాలని, ప్రజల అసంతృప్తిని చల్లర్చాకపోతే వారి అగ్రహాన్ని చవిచూడాల్సివస్తుందని డాక్టర్ నారాయణ కేంద్రాన్ని హెచ్చరించారు. సమాజంలో అంతర్ భాగమైన ట్రాన్స్‌జెండర్లకు సిపిఐలో సభ్యత్వం ఇవ్వడం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమంలో వారిని భాగస్వామ్యం చేయాలని సిపిఐ జాతీయ మహాసభలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను హోంగార్డులకు నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని పూర్తిగా స్వాగతిసున్నామని, వారికి టోల్‌గేట్ల వద్ద ఉద్యోగ అవకాశాలు కల్పించి వారు సమాజంలో గౌరవంగా బతికే అవకాశం కల్పించాలన్నారు. తమిళనాడులో బహిరంగ సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటకు రాజకీయంగా, నైతికంగా టివికె అధ్యక్షులు విజయ్‌దే బాధ్యత అని, ఈ ఘటనలో చనిపోయిన వారికి విజయ్ ఒక్కొక్కరికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. టివికె వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిషోర్ వ్యూహంలో భాగంగానే తొక్కిసలాట చోటుచేసుకుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డాక్టర్ నారాయణ తమిళనాడు సిఎం స్టాలిన్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కళాశాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం గర్హనీయమని, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తూ యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ కార్యక్రమాన్ని నిషేధించేంత వరకు విశ్రమించబోమమన్నారు.




## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డికి సన్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పంజాబ్‌లోని చండీఘార్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డిని జిహెచ్‌ఎంసి కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సెంట్రల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సభ్యులు ఎండి. యూసుఫ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈటి నరసింహా, యూనియన్ అధ్యక్షులు ఎం. నరసింహ, కార్యనిర్వాక అధ్యక్షులు పి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉప ప్రధాన కార్యదర్శి జి.నర్సయ్య, నాయకులు రాజేష్, పి నవీన్, రాకేష్, యు.సతీష్‌కుమార్, మధు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా దసరా వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో దసరా పండుగ సంధర్భంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి, వాహన పూజ కార్యక్రమాల్లో పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సిపి మాట్లాడుతూ కమిషనరేట్ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కమిషనరేట్ ప్ర జలంతా, ఆయురారోగ్యాలతో ఉండాలని సిపి ఆ కాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(ఏఆర్) భీంరా వు, ఏసిపిలు విజయ్ కుమార్, రిజ ర్వ ఇన్స్‌పెక్టర్లు రజినీకాంత్, జానీమియా, శ్రీధర్‌రె డ్డి, కిరణ్ కు మార్, సిఐలు శ్రీనివాస్, రాంచందర్‌రావు, సృజన్ రెడ్డి, బిల్లా కోటేశ్వర్, సరిలాల్‌లతో పాటు ఇతర పో లీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ జయంతి ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ప్రతి యేటా నిర్వహించే గాంధీ జయంతి ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పరిశీలించారు. ఈ సంధర్భంగా గాంధీజీ విగ్రహానికి రంగులు వేసి ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించి గాంధీజీ విగ్రహం చుట్టూ పరిసరాలను శుభ్రం చేయడం జరిగినట్లు తెలిపారు. గాంధీ విగ్రహం చుట్టూ ఫౌంటేన్ నుంచి నీరు వచ్చే ప్రదేశాలను పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, సదానందం, సిఅ భాస్కర్, ఈఈ శ్రీకాంత్, పిట్టర్ ప్రవీణ్ రెడ్డి, వాటర్ సప్లై ఎలక్ట్రీషియన్స్ పలువురు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల సమరానికి సిద్ధం

### సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజాసమస్యలను పరిష్కారానికి అండగా నిలవాలని చిగురుమామిడి మండల సిపిఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రజలకు అండగా ఉన్నవారిని గుర్తించి ఓట్లు వేస్తారని, అందుకోసం సిపిఐ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సి పిఐ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న అనేక స మస్యలపై విజయాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. ప్రజాక్షేత్రం ను ంచి పని చేస్తున్న సిపిఐకి ప్రజల మద్దతు కచ్చితంగా లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. డబ్బు, మద్యం, అధికార బలం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు సరైన అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం ఉందని, కచ్చితంగా సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలపై పనిచేయడానికి సిపిఐ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ప్రజలను చైతన్య పరచడానికి అనేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడ ంలోనూ సిపిఐ తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. మండలంలో ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు. ఈ పోరాటంలో కార్యకర్తలు, సిపిఐ పార్టీ గెలుపుకు కృషి చేయాలని తెలిపారు.

## 144 సెక్షన్ అమలు:ఎస్ఐ నరేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/చొప్పదండి:** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సంధర్భంగా చొప్పదండి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు దుర్గామాత నిమజ్జన ర్యాలీలను, నిమజ్జనాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల లోపు మాత్రమే జరుపుకోవాలని, రాత్రి పది తర్వాత 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి ఊరేగింపులకు అనుమతి లేదని చొప్పదండి ఎస్ఐనరేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

### సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని,అమాయక ప్రజల నుండి డబ్బులు లాగడానికి ఒక ఎత్తుగడ అని సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్ అన్నారు. బుధవారం సైబర్ జాగృక్త దివస్‌లో భాగంగా సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి లారీ అసోసియేషన్ యాజమానులు,డ్రైవర్లకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ ఉండదని,ఆన్‌లైన్ బిజినెస్ ఇన్వెస్టమెంట్ ముప్పేనని,యాప్‌లలో డబ్బులు పెట్టి మోసపోవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే ఆన్‌లైన్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బులు ఉచితార్థంగా ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ,భయంతో సైబర్ నేరస్తుల వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారని,మీరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రయ్య,పోలీస్ సిబ్బంది,లారీ లారీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్‌లో విద్యుత్ షాక్‌తో ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/హుజురాబాద్:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణ శివారులోని సబ్ స్టేషన్ 132 కేవి సబ్ స్టేషన్‌లో విద్యుత్ షాక్‌తో ఆర్టీజియన్ గ్రేడ్ 2 అసిస్టెంట్ ఆపరేటర్ ఉద్యోగి బోడ శంకర్ రెడ్డి(40) మృతి చెందాడు. మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్థంభం ఎక్కి పని చేస్తుండగా, విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అయితే సబ్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఉద్యోగి దుర్మరణం చెందాడని స్థానిక ఉద్యోగులు తెలుపగా, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేస్తున్నారు.

## ఓటరు జాబితా ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని బంజేరు గ్రామ పంచాయతీ స్థానిక ఎన్నికల్లో ఎస్సీలకు ఓటరు జాబితా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని స్థానిక అధికారులను కోరారు. బుధవారం అంబేద్కర్ నగర్ కాలనీలోని దళితులు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ కేటాయింపులో ఎస్సీలకు అన్యాయం జరిగిందని అందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని మొత్తం 8 వార్డుల్లో 718 మంది ఓటర్లు ఉండగా అందులో ఎస్సీలు మూడు వార్డుల్లో కలపి 240 మంది ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ మూడు వార్డులకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ వాసులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలో 404 ర్యాంక్ సాధించిన అడవి శ్రీరాంపూర్ విద్యార్థిని శ్రీవర్షణి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గట్టు భూమయ్య,సునీత కూతురు శ్రీవర్షణి అనే విద్యార్థిని నీట్ పరీక్షలో 404 ర్యాంక్ సాధించి కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటును పొందింది. గ్రామం నుంచి ఎంబిబి ఎస్‌కు ఎంపికైన మొట్టమొదటి విద్యార్థిని శ్రీవర్షిని కావడం విశేషం. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబం,ఈసందర్భంగా గ్రామం నుంచి మెడికల్ సీటు సాధించిన మొదటి విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.గ్రామంలోని మిగతా విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు.ఈ సందర్భంగా ఎంబిబిఎస్ సీటు సాధించిన శ్రీవర్షణిని గ్రామ ప్రజలు అభినందించారు.

## 'హెల్పింగ్ హ్యాండ్స్' సేవలు అభినందనీయం

### పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు







**ప్రజాపక్షం/రామగిరి :** హెల్పింగ్ హ్యాండ్స్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాల్లో నేను సైతం భాగస్వామిగా మారతానని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దు ద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 29 నిత్యావసర సరుకులను పేదలకు అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెల్పింగ్ హ్యాండ్స్ వారు ఇప్పటివరకు 80 లక్షల రూపాయల వరకు సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు. గత శివ రాత్రి పర్వదినం రోజున వంద మంది నిరుపేదలకు సహాయం చేసే కార్యక్రమం చేపట్టడం హర్షనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలని ఆ కాంక్షించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు చేయుతనందించడంలో హె ల్పింగ్ హ్యాండ్స్ మరింతగా ముందుండాలని సూచించారు. హెల్పింగ్ హ్యాం డ్స్ చేసే సేవా కార్యక్రమాలకు మా వంతుగా సంపూర్ణ సహకారం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వైనాల రాజు, సింగల్ వి ండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ స యీద్ అన్వర్, మాజీ ఎంపిపి కోలేటి మారుతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తో ట్ల తిరుపతి యాదవ్, నాయకులు ఇనగంటి రామారావు, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, బిజెపినాయకుడు మచ్చగిరి రాము పాల్గొన్నారు.

**దుర్గామాత దీవెనతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**

దుర్గామాత దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి అనిరాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదెళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం లోని పలు దుర్గామాత విగ్రహాలను దర్శించుకొని పూజలు ని ర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, పంటలు సుభిక్షంగా పండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. దు ర్గామాత మండపాల నిర్వాహకులు మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, మ ండల పార్టీ అధ్యక్షుడు అన్వర్, సింగిల్ విండో చైర్మన్ భాస్కరరావు, మాజీ ఎం పిపికోలేటిమారుతి,ఇనుగంటిరామారావు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల భద్రతే లక్ష్యం

### ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పారిశుద్ధ కార్మికుల భద్రతే లక్షమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. బుధవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మున్సిపల్ కమిషనర్ తో కలిసి సుల్తానాబాద్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా రేడియం అప్రాన్లు ,రేయిన్ కోట్ లు పంపిణీ చేశారు. వారితోపాటు మున్సిపల్ నీటి సరఫరా సిబ్బందికి, ఫీల్డ్ సిబ్బందికి రేయిన్ కోట్ లు అందజేశారు. అనంతరం విజయ రమణారావు మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికుల అభ్యర్థి లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ శ్రీ అంతటి అన్నయ్య గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీ మిణుపాల ప్రకాష్ రావు , సింగల్ విండో చైర్ మెన్ శ్రీ శ్రీగిరి శ్రీనివాస్ , మున్సిపల్ మాజీ చైర్మెన్ శ్రీ గాజుల లక్ష్మి రాజమల్లు , వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకోండి



సిఐకు వినియోగదారుల సంక్షేమ సంఘం వినతిపత్రం అందజేత

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** గాంధీ జయంతి, దసరా పండుగ ఒకే రోజు రావడంతో మాంసం దుకాణాలు, చికెన్ సెంటర్ లు కోళ్లను, గొర్లను కొస్తే చర్యలు తీసుకోవాలని కోరుతూ వినియోగదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్ వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐ వీరప్రసాద్ సానుకూలంగా స్పందించి గాంధీ జయంతి రోజున ఎవరు అక్రమంగా మాంసం విక్రాయాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిమ్మశెట్టి రాజు, ఉపాధ్యక్షులు సయ్యద్ షబ్బీర్, కోశాధికారి నందగిరి చంద్రశేఖర్, లీగల్ అడ్వైజర్ మారుపాక నాగార్జున, కార్యవర్గ సభ్యులు గుడిసె ప్రవీణ్ లు పాల్గొన్నారు.

## 'నర్సరీ'ని సంరక్షించాలి

### కలెక్టర్ పమేలా సత్పతి సూచన



**ప్రజాపక్షం/కరీంనగర్:** నర్సరీలో పెరుగుతున్న మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం నగరపాలిక ఆధ్వర్యంలో ఎల్ఎండి సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నర్సరీ లో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి శుభ్రం చేయాలన్నారు. రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటించాలని సూచించారు. పండ్ల మొక్కలను ఉమెన్స్ కాలేజీలో, ఇతర చోట్ల పలు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పెరిగిన మొక్కలను వృథా చేయకుండా తప్పనిసరిగా నాటించాలని పేర్కొన్నారు. వారివెంటమున్సిపల్‌ఇఇసంజయ్‌కుమార్, ఎఇసల్మాన్ తదితరులున్నా రు.

**స్థల పరిశీలన**

మున్సిపల్ వాహనాలు నిలుపుదల కోసం కోటి రూపాయలతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసేందుకు హౌసింగ్ బోర్డు కాలనీలో స్థలం పరిశీలించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్‌ఇఇ సంజయ్ కుమార్‌కు పలు సూచనలు చేశారు.

**పనులు వేగవంతం చేయాలి**

బాలసదన్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రి సమీపంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.రెండు కోట్లతో చేపట్టిన బాలసదన్ భవన నిరాణ పనులను నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేసి భవనం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట మున్సిపల్ ఈఈ సంజయ్ కుమార్, తదితరులున్నారు

**వాహనాలకు పూజ**

విజయదశమి పండుగ పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీలో సబ్ స్టేషన వద్ద మున్సిపల్ రేకుల షెడ్డులో మున్సిపల్ వాహనాలకు పూజ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అర్చకుల సమక్షంలో వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్, మున్సిపల్ ఈఈ సంజయ్ కుమార్ తదితరులున్నారు.

## శాంతియుతంగా దసరా

### ప్రజలకు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి సూచన



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** దసరా పండుగను కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమైక్యంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం విజయదశమి సందర్భంగా గ్రామాల్లో జరిగే జమ్మి వేడుకలు ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగాలని,అందరూ పరస్పర సహకారంతో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ,ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ముందస్తుగా మండల ప్రజలకు ప్రజాప్రతినిధులకు అధికారులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .అనంతరం యువతను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మద్యం, గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తు పాడు చేసుకోకూడదని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం డ్రగ్స్,గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. డ్రగ్స్ వినియోగం, విక్రయం, సరఫరా,గంజాయి పండించడం వంటి చర్యలు చట్టపరంగా తీవ్ర నేరాలని, వాటిలో ఇరుక్కుంటే తప్పించుకోవడం అసాధ్యమని స్పష్టం చేశారు. అలాగే రాత్రి వేళల్లో రహదారుల వెంట బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని, అలాంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ఒక్కసారి పోలీస్ కేసుల్లో ఇరుక్కుంటే యువకుల భవిష్యత్తు అంధకారమవుతుందని, ఇలాంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా క్రమంగా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లోని యువజన సంఘాలు పోలీసులకు సహకరించి మత్తు నియంత్రణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు అందరూ సహకరించాలని, పండుగ ఆనందాన్ని సమైక్యంగా పంచుకోవాలని ఎస్ఐ ,కృష్ణ సాగర్ రెడ్డి ప్రజలను కోరారు.

## డా.బంగారి స్వామికి 'ఇండో యుకె గ్లోబల్ హెల్త్‌కేర్ లీడర్' అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రతిష్టాత్మకమైన ఆసియా టుడే వారి ఇండో యుకె గ్లోబల్ హెల్త్‌కేర్ లీడర్ అవార్డు 2025ను రెనే వైద్య సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి లండన్ పార్లమెంట్‌లో జరిగిన కార్యక్రమంలో మంగళవారం అందుకున్నారు. ప్రతి సంవత్సరం ఈ అవార్డు కోసం ఆసియా టుడే సంస్థ ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో అత్యున్నత సేవలు అందించిన వారిని ఎంపిక చేసి లండన్ పార్లమెంటులో ఈ అవార్డును ప్రధానం చేస్తారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా.బంగారి స్వామి మాట్లాడుతూ ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, వైద్యం అంటే కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, ఒక సామాజిక బాధ్యత అని అన్నారు. తాను ఈ అవార్డు సాధించడం వెనుక తన శ్రీమతి డా.బంగారి రజనీ ప్రియదర్శిని సహకారం, కుటుంబ ప్రోత్సాహం, హాస్పిటల్ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. గత రెండు దశాబ్దాలుగా సుమారు 65 వేలకు పైగా శస్త్రచికిత్సలు చేసిన అనుభవం ఉందని, ఎంతో మంది ప్రాణాలు కాపాడిన తృప్తి ఉందన్నారు. రెనే హాస్పిటల్ వారు సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం తన తల్లి కీ.శే.బంగారి లక్ష్మి స్మారకార్థం పది మందికి పూర్తి ఉచితంగా కీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తామని అన్నారు. వచ్చే అక్టోబర్ నెలలో ఉత్తర తెలంగాణలో మొట్టమొదటిసారిగా రోబోటిక్ ద్వారా కీలుమార్పిడి శస్త్ర చికిత్సను పరిచయం చేస్తున్నామని , దీని ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. హైదరాబాదు తర్వాత టైప్ 2 నగరాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు కరీంనగర్ ఇప్పుడు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. ఆధునిక వైద్య సేవల కోసం హైదరాబాదు లాంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాబోకే రోజుల్లో వైద్య రంగంలో వచ్చే ప్రతి అత్యాధునిక విప్లవాత్మక మార్పును రెనే హాస్పిటల్‌లో తీసుకురావడంలో తాము ఎప్పుడు ముందుంటామని తెలిపారు.

## ఎంసిహెచ్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో 250 ప్రసవాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సెప్టెంబర్ నెలలో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో 250 ప్రసవాలు జరిగాయని, దీనికి కృషి చేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎన్నడు సాధించని విధంగా సెప్టెంబర్ నెల జిల్లా లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల యందు కలుపుకొని 503 ప్రసూతులు నిర్వహించినందుకు గాను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత డాక్టర్లను, సిబ్బందిని క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.జిల్లా ఆసుపత్రి లో గతంలో డెలివరీ లు సరాసరి 130 ఉండగా సెప్టెంబర్ నెలలో అత్యధికంగా ఆల్ టైం రికార్డు స్థాయిలో 250 డెలివరీ లు జరీగాయని ఈ సంవత్సరము లోనే ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం ద్వారా 68 మంది నవ జాత శిశువులకు చికిత్స అందించడం జరిగిందని అన్నారు. గతంలో సరాసరి ఒపీ నెలకి12,500 ఉండగా గత సంవత్సర కాలంలో క్ర మంగా పెరిగి ఈ నెల 26,730 కు చేరుకుందని , దీనిలో అధికంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడీయాట్రిక్స్, గైనాకలజీ, కంటికి సంబంధించిన ఒపీ, చెవి ముక్కు గొంతు, డెంటల్ మరియు స్కిన్ ఒపీ లు రెట్టింపు కొన్ని విభాగలలో మూడు రేట్లు పెరిగాయని అన్నారు. గతంలో ఇన్ పేషెంట్ ఒక నెలకు సరాసరి 1100 ఉండగా ఈ సె ప్టెంబర్ 2025 నెలలో 2300 మంది ఇన్ పేషెంట్ సర్వీస్ పొందారని, గతంలో ఆర్థోపెడిక్ సర్జరీలు సరాసరి నెలకు 9 మేజర్ 10 మైనర్ ఉ ండగా ఈ నెల 34 మేజర్ 27 మైనర్ శస్త్ర చికిత్సలు ని ర్వహించడం జరిగింది. జనరల్ సర్జరీ గతంలో మేజర్ మరియు మైనర్ కలిపి 20 కాగా ఈ నెల 45 నిర్వహించారు. కంటి వైద్యులు పెద్దపల్లి జిల్లా పేషెంట్ లను కరీ ంనగర్ ఆసుపత్రి లో సర్జరీ చేసేవారు. ఈ సంఖ్య నెలకు 20 ఉండగా, నూతనంగా ఏర్పాటు చేసిన కంటి ఆపరేష న్ థియేటర్ వల్ల సెప్టెంబర్ 2025 గాను 229 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ.ఎన్.టి, డెంటల్ సర్జరీలు నిర్వహించే వాళ్ళు కాదని, గత నెల 15 ఈ.ఎన్ .టి ప్రొసీజర్స్ మరియు 529 డెంటల్ ప్రొసీజర్స్ నిర్వహించారని,రక్త పరీక్షలు నెలకు 31 వేలకు పెరిగిందని,గతంలో స్కానింగ్ సేవలు సరాసరి నెలకు 800 ఉండగా ఈ నెల 1960 స్కానింగ్ సేవలు చేశారు.గత ం లో టిఫ్ఫా స్కానింగులు ,2 డి ఎకో సేవలు జరిగేవి కావని, నేడు సెప్టెంబర్ నెలలో 123 టిఫ్ఫా స్కానింగ్ లు, 164 2డి ఎకో లు చేయడం జరిగిందని అన్నారు . గతంలో ఫిజియోథెరపీ సేవలు నెలకు 120 కాగా గత నెల 678 మందికి ఫిజియోథెరపీ సేవలు చేయడం జరిగింది.జిల్లాలో 5148 గర్భిణీ స్త్రీలను నమోదు చేయగా, అందులో 4,581 గర్భిణీలను మూడు నెలల లోపే న మోదు చేశారు. వీరందరికీ 100 శాతం , నాలుగు గ ర్భి ణీ పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రుల యందు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్త కార్యక్రమంలో 998 82 వి ద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. సమగ్ర టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమములో 72,495 మందికి ఛాతి ఎక్స్ రే లు నిర్వహించారు. ఇందులో 1097 టి.బి. వ్యాధి గ్రస్తుల గుర్తించి చికిత్స అందించు చున్నారు. ఎన్. సి. డి. స్క్రీనింగ్ 416530 మందికి 95% గా స్క్రీనింగ్ నిర్వహించారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార అభియాన్ కార్యక్రమములో 104 శిబిరంలో నిర్వహించి 7634 మహిళలకు స్పెషలిస్ట్ డాక్టర్ ల చే పరీక్షలు నిర్వహించడం జరిగింది. అదనముగా 27210 మంది మహిళలకు ఆయుష్మాన్ మరియు బస్తీ దవాఖాన ల ద్వారా పరీక్షలు నిర్వహించడం జరిగింది అని అన్నారు.

## ఐక్యత, సమగ్రతల కోసం కృషి

పోలీసు కమిషనర్ సాయిచైతన్య – జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** దుష్ట శక్తులపై విజయానికి సంకేతంగా జరుపుకునే దసరా పండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరు ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. బుధవారం దసరా పండుగ సందర్భంగా నిజామాబాద్ ప్రజలందరికి అక్టోబర్ 2న విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు, పోలీసు సిబ్బంది స్నేహ పూర్వకంగా సోదర స్వభావముతో కలిసి మెలగాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరు సంవత్సరకాలంలో వారి వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని అన్నారు.

## నిజాంసాగర్ నుంచి 77,329 క్యూసెక్కుల నీటి విడుదల



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 77,329 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టుట నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎగువ ప్రాంతం నుండి 1,02,516 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు 15 వరద గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నామని, అదేవిధంగా ప్రధాన పంట కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

## కుమ్రం భీం వర్ధంతికి రండి సిఎంకు ఆహ్వానం



**ప్రజాపక్షం/కేరిమేరి :** ఆదివాసీల ఆరాధ్యదైవం, పోరాట యోధుడు కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కోరుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కుమ్రం భీం మనుమడు, భీం కమిటీ చైర్మన్ కుమ్రం సోనేరావు, కుమ్రం లాల్ సావ్‌లు ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఐటిడిఎ నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు కమిటీ సభ్యులు సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. జోడేగాట్‌లో రోడ్డు పనులు పూర్తి చేయాలని, అలాగే జోడేగాట్ మీటింగ్ స్థలంలో షెడ్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పెందోర్ మోతిరం, జైనూర్ ఎఎంసి చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన పని భద్రత



**ప్రజాపక్షం/మందమర్రి :** దసరా పండుగను పురస్కరించుకొని మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో బుధవారం దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనాలు, పనిముట్లు, ఆయుధాలకు పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిఎం ఎన్. రాధాకృష్ణ, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ పాల్గొని ఆయుధ పూజలు నిర్వహించి కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ రక్షణతో కూడిన పనితో భద్రత ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్క్ షాప్ డివైజియం ధూప్ సింగ్, ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్, అధికారులు సదానందం, నరేష్, శ్రీనివాస్, సత్యగౌడ్, యూనియన్ నాయకులు పెద్దపల్లి బానయ్య, ములకలపల్లి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి శర్మ, పారి పెల్లి రాజేశం, కొంౡదు వెంకటేశం, జాడి సంతోష్, రాజకుమార్ పాల్గొన్నారు.

## అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎమ్మెల్యే ఘనస్వాగతం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్ నగర్ పట్టణ రైల్వే స్టేషన్‌లో బీహార్‌లోని ముజఫర్ పూర్ నుండి బయలుదేరి సిర్పూర్ కాగజ్ నగర్ మీదగా చర్లపల్లి వెళ్తున్న కొత్త అమృత్‌భారత్ ఎక్స్ప్రెస్ రైలుకు రైల్వేస్టేషన్‌లో సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్‌బాబు రైలుకు జెండా ఊపి సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం పూర్తి నాన్ ఎసిబోగీలతో 11 జనరల్ కోచులు, 8స్లీపర్ కోచ్‌లు ఉన్న అమృత్ భారత్ రైలు ద్వారా బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గొల్లపల్లి వీరభద్రచారి, దెబ్బటి శ్రీనివాస్, చిలువేరు ప్రవీణ్, అరుణ్ లోయా, హనుమంత్‌రావు, పెద్దిహరీష్, ప్రశాంత్, అనిల్, సాయి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, విద్య కమిటీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ వాసవి భవన్‌లో బుధవారం ప్రతిభా పురస్కారాలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైశ్య విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు కృషితో ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు బీరెల్లి విజయలక్ష్మి, పెద్ది రవీందర్, రాచర్ల అశోక్‌లను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తూడూరు నాగేశ్వరరావును శాలువాలతో సన్మానించారు. నూతనంగా లెక్చరర్ ఉద్యోగాలు పొందిన నిఖిల్, సాయిలకు కూడా సన్మానం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ తప్పనిసరి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ కార్యాలయ ప్రాంగణంలో పదవి విరమణ పొందిన సెక్యూరిటీ విభాగం జమ్మేదార్ వాసాల కనకయ్యను ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్, పర్మినెంట్, ప్రైవేట్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మాట్లాడుతూ వృత్తిరీత్యా కనకయ్య క్రమశిక్షణతో విధులు నిర్వహించేవారని, సెక్యూరిటీ విభాగానికి ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదారులు, పర్మినెంట్, ప్రైవేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హామీ మేరకు సంక్షేమ పథకాల అమలు

ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక చెక్కులను ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పుల కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవటానికి మాత్రం ఏమాత్రం ఎవెనుకడుగు వేయద్దన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని గుర్తు చేశారు. కళ్యాణలక్ష్మి 95 మంది లబ్ధిదారులకు . షాదీముబార్ 349 లబ్ధిదారులకు అందించామన్నారు. మొత్తం ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులలో ఉన్న ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేస్తున్నామని ఇది ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రూ.500 కు సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ రైతు భరోసా యువతకు ఉద్యోగాలు సన్నబియ్యం పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, వేణు, రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను పరామర్శించిన షబ్బీర్‌అలీ

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మి నర్సమ్మ ఇటీవల మృతి చెందటంతో ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ అన్నా రు. బుధవారం జిల్లాకేంద్రంలోని అశోక్ టౌన్‌షిప్‌లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసంలో లక్ష్మి నర్సమ్మ చిత్రపటానికి షబ్బీర్‌అలీ పూలమాలలు వేసి నివాళులర్పిం చి ఎమ్మెల్యే భూపతిరెడ్డితో మాట్లాడారు. పరామర్శించిన వారిలో నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు ఉన్నారు.



## శక్తిపీఠం అభివృద్ధికి సహకారం

అమ్మవారి పూజలో పాల్గొన్న కమిషనర్ దేవసేన



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట బగలాముఖీ శక్తిపీఠంలో సెక్రటరీ ఇంటర్ మీడియట్ బోర్డు, కళాశాల విద్యా రాష్ట్ర కమిషనర్ దేవసేన బుధవారం అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా శవర్నవరాత్రులలో భాగంగా నిర్వహించిన బగలాముఖీ అమ్మవారి పల్లకిసేవలో పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీనర్ దేవసేనకు బగలాముఖీ ట్రస్టు చైర్మన్, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్థలదాతలు పబ్బ రమేష్ గుప్త, పబ్బ మహేష్ గుప్త, పత్రాల శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వర, వామన శర్మ అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శక్తి పీఠం అభివృద్ధికి తమవంతు సహకారం తప్పకుండ అందిస్తానని దేవసేన అన్నారు. కార్యక్రమంలో తూముకృష్ణారావు, జంగం విజయవెంకటేష్, ఏనుగు సుధాకర్ రెడ్డి, లక్ష్మి నర్సయ్య, రాజీపేట వెంకటేష్ పాల్గొన్నారు.

## దసరా ఉత్సవ ఏరాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలో దసరా ఉత్సవ ఏర్పాట్లను బుధవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. బంగల్ పేట్ అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ ఏర్పాట్లను, దుర్గా నిమజ్జన శోభయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజా రక్షణతోనే పోలీస్‌శాఖకు గుర్తింపు

చెడుపై మంచి విజయాన్ని చాటే విజయదశమి

నిర్మల్ జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఆకాంక్షించారు. విజయదశమి వేడుకలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లా సాయుధ దళ కార్యాలయంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల శక్తికి ప్రతీకగా భావించే ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, పోలీసుల వాహనాలకు శుభపూజలు చేశారు. అనంతరం పోలీస్ పెట్రోల్ పంప్ వద్ద ఎస్పీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీస్ పంప్ ద్వారా 20 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం, అలాగే విజయదశమి సందర్భంగా సిబ్బందికి బోనస్‌ను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విజయదశమిని విజయాల పర్వదినంగా అభివరించారు. దుర్గామాత సమక్షంలో ఆయుధాలకు విశిష్టమైన శక్తి ఉంటుందన్నారు. ప్రజా రక్షణలో ప్రతి పోలీసు అధికారి అగ్రగామిగా ఉండి, పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజలందరూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని,ముఖ్యంగా నవరాత్రుల అనంతరం జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో బైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సాయుధ దళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టు పురుగుల సాగు అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు

జీవనాధారాన్ని దెబ్బతీశారంటూ ఆదివాసుల ఆందోళన

**ప్రజాపక్షం/చెన్నూర్ :** కోటపల్లి మండలం కవర్ కొత్తపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆదివాసీలు సాగు చేస్తున్న పట్టు పురుగులను అటవీశాఖ అధికారులు అడ్డుకొని, బుధవారం వాటిని ధ్వంసం చేశారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆదివాసీలు... చెన్నూరు పట్టణంలోని ఎఫ్‌డిఓ (ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్) కార్యాలయం ఎదుట అటవీ అధికారుల తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పట్టు పురుగుల సాగు తమకు తరతరాలుగా జీవనాధారమని, అధికారులు తమ సాగును ధ్వంసం చేసి తమ పొట్ట కొట్టడం ఏమాత్రం సమంజసం కాదని ఆదివాసీలు వాపోయారు. తమకు జరిగిన నష్టం అపారమని, దీనికి అటవీశాఖ అధికారులే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే తమకు కలిగిన నష్టాన్ని అటవీశాఖ భర్తీ చేయాలని, భవిష్యత్తులో తమ జీవనోపాధిని అడ్డుకోవద్దని వారు కోరారు. తమకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, పట్టు పురుగుల ధ్వంసానికి కారణమైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కవర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు.



## సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** సమాజ సేవలో విశేష కృషి చేసినందుకు జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న న్యాయవాది రెడ్డిమల్ల ప్రకాశంను లక్షెట్టిపేటలో ఘనంగా సన్మానించారు. గత నెల 15న విజయవాడలో మదర్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆయనకు జాతీయ సేవారత్న అవార్డు అందించింది. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం లక్షెట్టిపేటలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆర్‌టిసి అసిస్టెంట్ డిపో మేనేజర్ రామిళ్ల మురళి సహా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.



# ఎన్నికల నిర్వహణకు హెల్ప్‌లైన్ ఏర్పాటు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికల దృష్ట్యా నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ఇతర ఎన్నికల సంబంధించి సమాచారం, ఫిర్యాదులు, ఇతర దరఖాస్తుల కొరకు హెల్ప్ లైన్ నం.08736 250501 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి హెల్ప్‌లైన్ నెంబర్‌లో సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంబంధిత సమాచారం, ఫిర్యాదులకు సంప్రదించవచ్చని తెలిపారు

### మెరుగైన వైద్య సేవలు అందించాలి

**భీమారం/ మంచిర్యాల :** ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. వైద్యరంగాన్ని బలోపేతం చేసే దిశగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసి, అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. బుధవారం భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించే విధంగా ప్రజలకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి అధికారి పాత్ర కీలకం

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న నిపుణులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి అధికారి పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ప్రధానమని ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు తమ విధులను, బాధ్యతలను ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో విపులంగా వివరించారు. అధికారులకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలు, ఎలక్షన్ మెటీరియల్ వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎటువంటి లోపాలకు తావు ఇవ్వకుండా తమ విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్ డీపీఓ శ్రీనివాస్ డీఈఓ భోజన్న తదితరులు పాల్గొన్నారు.




## అర్బన్ పార్కు సందర్శించిన పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని అర్బన్ పార్కును బుధవారం పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్, అండ్, రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జాన్ వెస్లీ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అర్బన్ పార్కులోని వాచ్ టవర్ పైకి ఎక్కి అటవీ అందాలను వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, కార్యదర్శులు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.



# రూ.రెండు వేల కోసం ఒకరి దారుణహత్య

హత్య కేసును చేధించిన వన్‌టౌన్ పోలీసులు

వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఒ రఘుపతి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి 2 వేల రూపాయల కోసం ఒకరిని దారుణంగా హత్య చేసిన కేసును వన్ టౌన్ పోలీసులు చేధించారు. ఈ హత్య కేసుకు సంబంధించిన వివరాలను వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి బుధవారం వెల్లడించారు. గతనెల 6న నిజామాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని శ్రీనివాస కిరాణషాపు ముందు ఒక గుర్తు తెలియ ని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు ఫిర్యాదు అందటంతో వన్ టౌన్ లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులను విచారించగా నమ్మదగిన సమాచార ప్రకారం కోటగిరి మండలం జల్లపల్లికి చెందిన షేక్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించగా తాను చేసిన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు రోజువారి కూలీ పనులు చేస్తూ రైల్వేస్టేషన్ వద్ద సంచరిస్తుంటాడు. మద్యం అలవాటు కారణంగా డబ్బుల కోసం రైల్వేస్టేషన్ వద్ద ఒంటరిగా కనిపించే వారిని బెదిరించి కొట్టి డబ్బులు దోచుకుంటాడు. గతనెల 6న రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలోని లక్ష్మి లాడ్జీ పక్కన శ్రీనివాస కిరాణషాపు ముందు ఒక పెద్దాయన డబ్బులు లెక్క బెడుతూ కనిపించగా దాంతో అతనిని చంపి డబ్బులు దోచుకోవాలనే ఉద్దేశ్యంతో అతని దగ్గరకు వెళ్లి డబ్బుల కోసం బెదిరించాడు. ఆ పెద్దాయన డబ్బులు ఇవ్వకపోవంతో నిందితుడు ఒక బట్టతో అతడి మెడకు ఉరి బిగించి హత్య చేసి అతడి వద్ద నుండి 2 వేల నగదు, ఫోన్ దోచుకున్నట్లు విచారణలో అంగీకరించటం జరిగిందన్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపారు.

# ముగిసిన నైరుతి రుతుపవనాల కాలం

**బుధవారం నుంచి ఈశాన్య రుతు పవనాలు మొదలు**

**33 శాతం అధిక వర్షపాతం నమోదు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నైరుతి రుతు పవనాల కాలం ముగియడంతో బుధవారం నుంచి ఈశాన్య రుతు పవనాల కాలం మొదలైంది. నైరుతి రుత పవనాల కాలంలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసిశాయి. జూన్ నుంచి జూలై మూడో వారం వరకు వర్షాలు కురువక రైతులను ఇబ్బంది పెట్టినప్పటికీ ఆ తర్వాత గడిచిన రెండున్నర నెలల కాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో సగటు వర్ష పాతం కంటే 32 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. అయితే కొన్ని జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని జిల్లాలో అధికం, మరిన్ని జిల్లాలో సాధారణ వర్ష పాతం నమోదైంది.

**జూన్‌లో మాత్రమే లోటు వర్షపాతం నమోదు**

ఈ ఏడాది రాష్ట్రంలో మే 26వ తేదీన నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ జూన్‌లో వేడి గాలుల ప్రభావంతో సరైన వర్షాలు కురువలేదు. దీంతో నెలలో 130.3 మిమీటర్ల వర్షపాతానికి గాను కేవలం 104.2 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో 20 శాతం లోటు నమోదైంది. జులైలో సైతం మూడు వారాలు ఇదే పరిస్థితి కొనసాగినప్పటికీ చివరి రోజుల్లో భారీ వర్షాలు కురువడంతో 227.4 మి.మీలకు గాను 237.9 మి.మీతో 5శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక అగస్టు నెలకు సంబంధించి మాత్రం వర్షాలు దంచి కొట్టడంతో 215.8 మి.మీ.లకు గాను ఏకంగా378.5 మి.మీ. 75 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో సైతం 167.1 మి.మీలకు గాను 267.7 మి.మీ (60 శాతం) అధిక వర్షం కురిసింది. నైరుతి రుతు పవనాల కాలంలో రాష్ట్రంలోని 33 జిల్లాలో 7 జిల్లాల్లో సాధారణ కంటే ( 62నుంచి 92 శాతం వరకు) అత్యధిక వర్షం కురువగా, 16 జిల్లాల్లో (సాధారణం కన్నా 20 నుంచి 59 శాతం వరకు) అధిక వర్షపాతం నమోదైంది. అదేవిధంగా 9 జిల్లాల్లో (8 నుంచి 19శాతం వరకు) సాధారణ వర్షపాతం రికార్డు కాగా, ఒకే ఒక్క జిల్లా పెద్దపల్లిలో మాత్రం సాధారణం కంటే 1 శాతం తక్కువ వర్షపా తం నమోదైంది. మరోవైపు అన్ని మండలాల్లోనూ ఈసారి మంచి వర్షాలే పడ్డాయి. కేవలం మూడు మండలాల్లోనే లోటు వర్షపాతం నమోదైంది.

**7 జిల్లాల్లో అత్యధికవర్షపాతం**

మెదక్ అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో సాధారణ వర్షపాతం 679.4 మీమీలకు గాను 1303.3 వర్షపాతం కురిసింది. ఇది 92 శాతం అత్యధికం అదేవిధంగా యాద్రాది భువనగిరి 931 (74శాతం), సిద్దిపేట 1063 (72 శాతం), మహబూబ్‌నగర్‌లో 896.6 ( 70 శాతం), నాగర్ కర్నూల్ జిల్లాలో815.9 (67శాతం), కామారెడ్డి 1328.7 మిమి (65 శాతం), వనపర్తి 830 ( 62 శాతం ) అత్యధిక వర్షపాతం నమోదైంది.

**16 జిల్లాలో అధిక వర్షపాతం**

నారాయణపేట 784.5 (55శాతం), రంగారెడ్డి 823.6 (49 శాతం), హైదరాబాద్ 920.9 (46 శాతం), జోగులాంబ గద్వాల్ 662.3 (45శాతం), సంగారెడ్డి 947.9(41శాతం), వికారాబాద్ (40 శాతం), మేడ్చల్ మల్కాజ్‌గిరి 840.4 (38శాతం), ఆదిలాబాద్ 1364.4 (36శాతం), వరంగల్ 1102.4 (28శాతం), కరీంనగర్ 935.8 (27 శాతం), నిర్మల్ 1157(27శాతం), ములుగు 1457.4 (26శాతం), కుమురంబీమ్ 1312.8 (26శాతం), సూర్యాపేట 721.1 (25 శాతం), నల్లగొండ 618.2 (24 శాతం) ఖమ్మం 984.2 (24శాతం) చొప్పున అధిక వర్షం కురిసింది.

**10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం**

నిజామాబాద్ 1030.4, జనగాం793.1,భద్రాద్రి కొత్తగూడెం 1158.0, మహబూబాబాద్ 958.4, రాజన్న సిరిసిల్ల 813.7, జయశంకర్ భూపాలపల్లి 1058.1, మంచిర్యాల్ 1043.3, హనుమకొండ 899.6, జగిత్యాల 922.4, పెద్దపల్లి 858.9 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదైంది.

**ఈశాన్య రుతు పవనాలు రంగ ప్రవేశం**

మంగళవారంతో నైరుతి రుతు పవనాల కాలం ముగిసి బుధవారం నుంచి ఈశాన్య రుత పవనాల కాలం మొదలైంది. ఈశాన్య రుతు పవనాలు ప్రారంభంతోనే వారం రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అది గురువారం నాటికి వాయుగుండంగా బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకువిస్తరించే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రం మొత్తానికి వాతావరణ శాఖ బుధవారం ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో అక్టోబర్ మొదలు డిసెంబర్‌కు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా విస్తరంగ్వా వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.

## చుక్కా రామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల విద్యార్థులను సాంకేతిక సైన్యంగా తయారు చేసి, తరగతి గది ప్రాణంగా జీవించిన స్వాతంత్ర సమరయోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా ప్రముఖ గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ ' అనే పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ దేశం ఆత్మ గ్రామమని గాంధీజీ చెప్పారని, తెలంగాణ గ్రామాల విముక్తి కోసం చుక్కారామయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీ వ్యక్తి త్వం, ఆయన ఆలోచనలు ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు.












## ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో కీలక విభాగమైన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదనపు డిజిపి విజయ్‌కుమార్ లక్డికాపూల్‌లోని ఇంటెలిజెన్స్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1997 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన విజయ్‌కుమార్ బీహార్ వాస్తవ్యులు. సైబరాబాద్ డిసిపిగా, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి), నిజామాబాద్ డిఐజిగా, డిజిపి కార్యాలయంలో కోఆర్డినేషన్ ప్లానింగ్ అదనపు డిజిగా, ఎసిబి డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఐపిఎస్ బదిలీలలో ఆయనకు ఇంటెలిజెన్స్ చీఫ్ పదవి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కొత్తగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత విజయ్‌కుమార్ డిజిపి శివధర్‌రెడ్డితో పాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## రేవంత్‌రెడ్డి వికలాంగుల ఆత్మబంధువు : వీరయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఆత్మబంధువు అని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముట్టినేని వీరయ్య అన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఉద్యోగులందరికి 2010, 2015, 2020 పిఆర్‌సితో కూడిన జీతం ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎంతో పాటు డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాను కార్పొరేషన్ చైర్మన్ అయినా తర్వాత మెదటి బోర్డు మీటింగ్‌లోనే 2010,2015,2020 సిఆర్‌సి వర్తింపజేయాలి అని తీర్మానం చేసి ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపానని గుర్తు చేశారు.ఈ ఫైల్‌పై సిఎం సంతకం పెట్టడంతో పాటు సెప్టెంబర్ జీతంతో కలిసి పిఆర్‌సి ఇవ్వడం తమకు సంతోషం కల్పించారన్నారు.





































# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/ కమలాపూర్:** స్థానిక సంస్థల ఎన్నికల వేళ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగింది. కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల పల్లి గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని, స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ తనదైన నాయకత్వ లక్షణాలతో పార్టీని, అభివృద్ధిలో సమన్యాయం పాటిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విజయదశమి అందరికీ విజయాలు చేకూర్చాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సకల విజయాలను అందించే విజయదశమి జిల్లా ప్రజలకు విజయాలను చేకూర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆకాంక్షించారు. అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రతి ఏటా ఇలాంటి విజయదశమి వేడుకలను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు సిపిఐ పార్టీశ్రేణులు, అభిమానులకు విజయదశమి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## నోట్ల ప్రలోభాలతో ఓట్లను కొనొద్దు

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీల అభ్యర్థులైన ఇండిపెండెంట్ అభ్యర్థులైన నోట్లతో మద్యంతో వివిధ ప్రలోభాలతో ఓట్లను కొనుగోలు చేయడం మానుకోవాలని, బాధ్యతాయుతమైన ఓటరు తమ అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దని ప్రజాస్వామ్య విలువలను ప్రతి ఒక్కరు కాపాడాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించి తొమ్మిదవ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ఉంటుందని ప్రకటించిన ఈ అంశంపై 8న హైకోర్టులో విచారణ ఉన్నందున ఎన్నికలు జరుగుతాయో లేదో అనే సందిగ్ధ పరిస్థితి నెలకొన్నదన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటిస్తే పైకి రాజకీయ పార్టీలన్నీ బలపరుస్తున్నట్టు చెప్పిన ఇప్పటిదాకా అధికారాన్ని అనుభవించిన అగ్రవర్ణాలకు చెందిన కొందరు ప్రత్యక్షంగా మరికొందరు పరోక్షంగా కుట్రలు పన్నుతున్నారని అలాంటి బిసి ద్రోహులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ పరిస్థితుల్లో బిసిలంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యమై బిసి రిజర్వేషన్లు అమలుకై ఎలాంటి త్యాగాల కైనా సిద్ధమై పోరాడాలన్నారు. ఏది ఏమైనా పెంచిన రిజర్వేషన్స్ తోనే ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారినందున సామాన్యులు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు మృగ్యమైనాయని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యవంతులైన ఓటర్లు ధనస్వామ్యాన్ని ఓడించి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాలని, నీతికి కట్టుబడి నిజాయితీగా నిస్వార్థంగా ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం పనిచేసే అభ్యర్థుల గెలిపించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి జరుపుకుంటారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. విజయదశమి దసరా సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి సందర్భంగాని యోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో తులతూగాలని ఎమ్మెల్యే ఆశా భావం వ్యక్తం చే శారు. ఆ భగవంతుని కృప నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళల ఉండాలని ఆ కాంక్షించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విజయదశమి జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## కోర్టు ఆదేశాలతో చైర్మన్‌గా రాము

**ప్రజాపక్షం/నెక్కొండ:** రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికల నిర్వహణలో జాప్యం వల్ల కాల పరిమితి పూర్తయిన సహకార సంఘం ఛైర్మన్లకు మళ్లీ కొనసాగించాలని ఆదేశించింది. అయితే వరంగల్ జిల్లాలో చెన్నారావుపేట, నల్లబెల్లి, నెక్కొండ, నాచినపల్లి, దుగ్గొండి ససహకార సంఘాల ఛైర్మన్లను కొనసాగించడంలో సందిగ్ధం ఏర్పడటంతో ఆయా ఛైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం వీరిని ఛైర్మన్‌గా కొనసాగించాలని ఆదేశించడంతో నెక్కొండ సహకార సంఘం ఛైర్మన్ మారం రాము, సభ్యులతో మంగళవారం సాయంత్రం విధుల్లో చేరారు.

## కబడ్డీ పోటీలను వీక్షించిన ఇంగ్లాండ్ దేశస్థుడు



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** దసరా క్రీడల్లో భాగంగా బుధవారం లక్ష్మీ దేవిపేట గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఇంగ్లాండ్ దేశానికి చెందిన నికోలస్ వీక్షించారు. అమరావతి విద్యాలయంలో ని గ్రౌండ్ లో జరిగిన ఫైనల్ పోటీలలో పట్వారిపల్లి, నర్సింగాపురం గ్రామాలు పోటీపడ్డాయి. ప్రథమ బహుమతి లక్ష్మీపురం, ద్వితీయ బహుమతి నర్సింగాపూర్, తృతీయ బహుమతి బూర్గుపేట గెలుచుకున్నాయి. నర్సింగాపూర్ కు చెందిన మిత్రుడి ఇంటి వద్దకు వచ్చిన నికోలస్ క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు కబడ్డీ పోటీలు అద్భుతంగా జరిగాయని క్రీడాకారులు బాగా రాణించారని అన్నారు. పలువురు విదేశీయునితో ఫోటోలు దిగారు.

## హస్తం కండువా కప్పుకున్న యువకులు



**ప్రజాపక్షం/జనగామ:** డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు తరిగొప్పుల మండల అధ్యక్షులు వగలబోయిన యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో సోలిపురం గ్రామ శాఖ అధ్యక్షుడు దండ్యం ప్రకాశం అధ్యక్షతన సోలిపురం గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీలో పలువురు యువకులు కురుమ అనిల్ యాదవ్, చెవిటి బాబు రాజు, వల్లెపు ఆకాష్, కరుణాకర్, గాదపాక నరసయ్య, తదితరులు చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి, అదేవిధంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నందుకు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివకుమార్, పోచయ్య, లూకా, నరసింహ చారి, సతీష్, శ్రీనివాస్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

# వెల్‌నెస్ సెంటర్‌కు ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

ఎంపి కడియం కావ్య, కలెక్టర్ స్నేహ శబరీష్,



**ప్రజాపక్షం/హనుమకొండ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వరంగల్ జిల్లాకు మంజూరైన సిజిఈహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ భవనం కోసం పలు ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం పరిశీలించారు. ముందుగా హనుమకొండలోని కుడా కార్యాలయంలోని భవనాలను పరిశీలించి వాటి వివరాలను ఎంపి డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెయు క్రాస్ రోడ్డు సమీపంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవనాన్ని పరిశీలించారు. అదేవిధంగా కాజీపేటలోని మున్సిపల్ కార్యాలయంలోని గదులను ఎంపి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పరిశీలించి డిప్యూటీ కమిషనర్ రవీందర్‌ను మున్సిపల్ కార్యాలయంలోని ఖాళీగా ఉన్న వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఆటోనగర్ సమీపంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని గదులను పరిశీలించి వాటిని గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవలను అందించేందుకు సిజిఈహెచ్‌ఎస్ వెల్నెస్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం, సదుపాయాలు, తదితర అంశాలను గురించి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ వరంగల్ జిల్లాల డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.కాగా సిజిఈహెచ్‌ఎస్ వెల్ నెస్ సెంటర్ సాధించిన వరంగల్ ఎంపి కడియం కావ్యకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి జరుపుకుంటారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మన్ దసరా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆనందం, ఆరోగ్యం నింపాలని, ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం వెల్లివిరియాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను ఎమ్మెల్యే నాగరాజు దర్శించుకున్నారు. 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాల్పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంక హరిబాబు నివాసం నందు ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతను దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అనంతరం దుర్గామాత వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు వడ్డన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ"శరన్నవరాత్రులు మన సాంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విశిష్టతలకు ప్రతీక. దుర్గామాత శక్తి రూపిణి. చెడుపై మంచి సాధించే శక్తిని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించే మహాశక్తి. ఇలాంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయి. ప్రజలందరూ ఆనందంగా, భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెఆర్ కృష్ణమూర్తి, మన్నే బాబురావు, చింత రమేష్, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండ :** దసరా ఉత్సవాల ఏర్పాట్లను స్వయంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని చిన్న వడ్డేపల్లి చెరువు సమీపంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సంవత్సరం సద్దుల బతుకమ్మ నాటికి చిన్న వడ్డేపల్లి బతుకమ్మ ప్రాంగణాన్ని బతుకమ్మ కుంటగా నామకరణం చేసుకొని అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ దసరా వేడుకలు నిర్వహించుకుందామన్నారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు.పట్టణ, మండల, గ్రామాల ల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై, తొమ్మిది రోజుల పాటు సాగిన సద్దుల బతుకమ్మగా ఆడబిడ్డల ఆటాపాటలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక సాంస్కృతిక వాతావరణా న్ని సంతరించుకున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయాలను అం దించే విజయదశమిని స్వాగతిస్తూ, తొమ్మిది రోజుల పాటు బతుక మ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నే తృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తయ్యాయని ఎ మ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లే లా, ప్రజలంతా సుఖశాంతులతో జీవించి, దినదినాభివృద్ధి పొందేలా దీవించాలని అమ్మవారిని ఎమ్మెల్యే నాగరాజు ప్రార్థించారు. ప్ర భుత్వం తరపున ప్రజలందరికీ పండుగలు ఆనందంగా జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పండుగల సందడిలోనూ భద్రత, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సోదర భావంతో ఈ పండుగలను జరుపుకొని మన తెలంగాణ సాంస్కృతిక గర్వాన్ని దేశానికంతటికి చాటి చెప్పాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే అన్నారు.

# అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలైన నేపథ్యంలో జిల్లాలోనూ ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చిందని, నవంబర్ 11వ తేదీవరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చిందని, షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుండి నవంబర్ 11వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు మొదటి దశలో ఆరు మండలాలు, 67 ఎంపిటిసి స్థానాలకు, రెండో దశలో ఆరు మండలాలు, 62 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీలకు రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికల నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లాలో రెండు, మూడో దశల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 210 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో 1986 వార్డులు ఉన్నాయన్నారు. మొదటి దశలో 108గ్రామపంచాయతీలకు, 1074 వార్డులకు, రెండో దశలో 102 గ్రామపంచాయతీలు, 912 వార్డులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3లక్షల 70 వేల 871 మంది ఓటర్లు ఉండగా స్థానిక సంస్థల్లో ఓటు వేయనున్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1, 80, 000 మంది ఓటర్లు, మహిళలు 1,90, 000 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 210 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. ప్రతి 650 మంది ఓటర్ల గాను ఒక పోలింగ్ కేంద్రాన్ని కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 1980 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల వారీగా ఇదివరకే ఓటర్ల జాబితా ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. మొదటి దశ శిక్షణ కార్యక్రమం ఇప్పటి వరకే పూర్తయ్యిందని, మిగిలిన అధికారులు, సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధులకు తగినంత సిబ్బంది ఉన్నారని అన్నారు. గుజరాత్ నుండి పోలింగ్ బాక్స్‌లను గత నెలరోజుల క్రితమే జిల్లాకు కేటాయించారని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ ఎస్ టి బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన అంశాలను స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు నోడల్ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారామ్, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల ఆర్డిఓ డాక్టర్ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, జెపి సిఇఒ రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కొలను సంతోష్ రెడ్డి, జి.ప్రభాకర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, ప్రవీణ్ కుమార్, నాగబెల్లి రజినీకాంత్, మంజుల మణి, ఎండి నేహాల్, కొట్టె ఏసోబు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో నిస్వార్థంగా పనిచేసే కమ్యూనిస్టులను ఆదరించండి

మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ:** స్థానిక సంస్థలైన వార్డు మెంబర్లు, సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు జరిగే ఎన్నికలలో గ్రామ, మండల అభివృద్ధికి పాటుపడే నిస్వార్థ సేవకులుగా పనిచేసే కమ్యూనిస్టు సభ్యులను పోటీచేసే అన్ని చోట్ల గెలిపించాలని ప్రజలకు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా సమితి సమావేశం మోటె శ్రీశైలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో నిజంగా ప్రజలకు సేవ చేయాలని ఉంటే అభివృద్ధి కాముకులుగా పేరు పొందాలంటే అందరు డబ్బులు పంచకుండా ప్రజలను ఓటు ద్వారా గెలవడం నిరూపించుకోవాలని పోటీ చేసే అభ్యర్థులకు సూచించారు. కమ్యూనిస్టు పార్టీలు ఎపుడూ పేద ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాడుతూనే వారికి అండగా నిలుస్తున్నారని, అటువంటి కమ్యూనిస్టు పార్టీ సభ్యులను పోటీచేసే అన్ని స్థానాలలో గెలిపించడం ద్వారా గ్రామ, మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిస్వార్థంగా ఓటు వేసినపుడే నిలదీసే హక్కు ప్రజలకు ఉంటుందని రాజారెడ్డి ఓటర్‌లకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సో మయ్య, రావుల సదానందం, పాతూరి ప్రశాంత్, జిడి ఎల్లయ్య, జువారి రమేష్, కావటి యాదగిరి, బోనగిరి కుమారస్వామి, చెల్లోజు మల్లేశం, మోటె శ్రీశైలం, పైస రాములు, చామకూర యాకూబ్, మాలోతు సీతారాం నాయక్, గుగులోతు సఖి, సముద్రాల రాజు, ఎండి యూనస్, బంటు పాండు, నీల కనకయ్య, తెజావత్ విజయ, పండుగ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## మారనున్న ఘనపూర్ మున్సిపాలిటీ రూపురేఖలు:రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ:** రానున్న రోజులలో ఘనపూర్ మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బుధవారం సంబంధిత అదికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘనపూర్ మున్సిపాలిటీ కార్యాలయ భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సెంట్రల్ లైట్, సీసీ రోడ్లు, డ్రైన్లు, వైకుంఠదామం, జంక్షన్ అభివృద్ధి పనులు, రోడ్డు వెడల్పు వంటి పనులకు రూ.50కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ క్రమంలో అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలను తొందరగా తయారుచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఒలు గోపిరామ్, డిఎస్ వెంకన్న, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అధిక లాభం, ఆశ చూపి కోట్లు దోచుకున్న ముఠా అరెస్ట్

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం /వరంగల్ క్రైమ్ :** పెట్టిన పెట్టుబడికి అధిక మొత్తంలో లాభం ఆశ చూపిస్తూ ప్రజల నుండి కోట్ల రూపాయలను దోచేసిన నలుగురు సభ్యుల ముఠాను టాస్క్ ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి 5లక్షల92వేల రూపాయలతో పాటు, 684.5 గ్రాముల బంగారు నాణాలు,150 గ్రాముల బంగారు ఆభరణాలు,ఒక కారు సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్, రసీదు పుస్తకాలు, క్యాష్ కౌంటింగ్ మిషన్, చెక్ బుక్స్, స్టాంప్స్ తో పాటు పొలాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ కు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ..పోలీసులు అరెస్టు చేసిన నిందితులలో సూర్యాపేట జిల్లా వాసి ప్రస్తుత నివాసం పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన తెప్పాలి సైదులు, ఆంధ్రప్రదేశ్ కృష్ణ జిల్లా నందిగామకు చెందిన మనుబోతుల రామకృష్ణ, సూర్యాపేట జిల్లా వాసి ప్రస్తుత నివాసం పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పొడిల సురేష్ కుమార్, పొడిల శ్రీధర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన ముఠాలోని ప్రధాన నిందితుడు తెప్పాలి సైదులు తన భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా పేరుతో ఒక సంస్థను 2023 సంవత్సరంలో ఏర్పాటు చేసాడని, అనంతరం ప్రధాన నిందితుడు 2024 సంవత్సరంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక లాభాలు ఆశ చూపిస్తూ చీటీ వ్యాపారాన్ని ప్రారంభించాడని చెప్పారు. ఈ చిట్టీ లో చేరే వారు ముందుగా ఆరు వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుందని, సభ్యులు చెల్లించిన డబ్బులో నాలుగు వేలు తన వద్దనే డిపాజిట్ చేసుకొని మిగితా రెండు రెండు వేల రూపాయలకు సభ్యులకు ఈ సంస్థపై నమ్మకం నమ్మకం కలిగేందుకు సభ్యులకు రెండు వేల రూపాయల విలువ వస్తువులను అందజేస్తాడని,వాస్తవంగా ఈ వస్తువుల విలువ కేవలం మూడు వందలు మాత్రమే వుంటాయని, ఈ సంస్థ లో ఒక సభ్యుడు ఎన్ని సభ్యత్వాలైన పొందవచ్చు అన్నారు. ఇందులో జాయిన్ అయిన ప్రతి సభ్యుడికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున 20 నెలల పాటు డబ్బు ను తిరిగి అందజేసేవాడు అని, ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28, 493 సభ్యత్వాలను నమోదు చేసుకోవడంతో పాటు వీరి నుండి 4వేల రూపాయల చొప్పున మొత్తం 11 కోట్ల39 లక్షల రూపాయలు ప్రజల డబ్బు ను తన వద్దనే భద్రపరుచుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు అన్నారు. అదే కాకుండా నిందితుడు సభ్యులకు కేవలం మూడు వందల రూపాయల విలువ వస్తువులను అందజేయడం ద్వారా మరో4కోట్ల 84 లక్షల రూపాయలను మోసం చేసినట్లుగా పోలీసుల దర్యాప్తు లో నిర్ధారణ అయిందని,ముఖ్యంగా ప్రజలు అత్యాశతో ఈ సంస్థ లో లక్షల్లో పెట్టుబడి కూడా జరిగిందన్నారు.ఈ ముఠా పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్, వర్ధన్న పేట, టాస్క్ ఫోర్స్ ఏసీపీ నర్సయ్య, మధుసూదన్, టాస్క్ ఫోర్స్ ఇన్స్ స్పెక్టర్ పవన్, పాలకుర్తి సిఐ జానకీరాం రెడ్డి, పాలకుర్తి ఎస్. ఐ, టాస్క్ ఫోర్స్ ఎస్. ఐ వంశీ కృష్ణ, దిలీప్,తో టాస్క్ ఫోర్స్ పాలకుర్తి పోలీస్ సిబ్బంది ని పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## శ్రీ దేవీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని లడకబజార్ నందు శ్రీ దేవీ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు కురువెళ్ళ వెంకటపురుషోత్తమరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ మహాఅన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల నర్సింహామూర్తి, కుంచం కృష్ణారావు, కొల్లా శ్రీనివాసరావు, చలువాది కృష్ణమూర్తిలను కమిటీ వారు అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పిండి నాగరాజు, గుండెమెడ బాలాజీ, కృష్ణయ్య, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించే అవకాశం కల్పించాలి : మువ్వా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల ప్రజలు సిపిఐ పార్టీ తరపున నిలబడిన ప్రజాప్రతినిధులను అత్యధికముగా గెలిపించి, ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా) అన్నారు. బుధవారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం మోరంపల్లిబంజర్‌లోని సిపిఐ జిల్లా సమితి సభ్యులు అలవాల సీతారామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రజల పక్షాన మనం చేసిన ప్రజాపోరాటాలే విజయానికి దోహదపడుతాయని అన్నారు. ప్రజలు మోసపూరిత మాటలను నమ్మకుండా నిత్యం ప్రజల కోసం పోరాడే సిపిఐ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు పాండవుల బిక్షం, ముదిగొండ బాలకృష్ణ, సిద్ధారపు సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, కూరపాటి దాసు, ఎస్‌డి సాజిద్, మల్సూర్, పిచ్చమ్మ, వెంకటేశ్వరరెడ్డి, రాంబాబు, బలరాం, కాటూరి రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎ కరీం అకాల మృతి పట్ల పలువురి సంతాపం

**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని ఖాజీపురం మాజీ సర్పంచ్, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం సోదరుడు ఎంఎ కరీం బుధవారం ఉదయం అకాల మృతి చెందారు. ఈ మృతి వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, టిడిపి జిల్లా నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, మల్లారం శాఖ కార్యదర్శి పరుచూరి రాము, మల్లికార్జున్ ఉన్నారు.

## ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

### మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తెలిపారు. బుధవారం డిపిఆర్‌సి భవనంలో నోడల్ అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్క రూ తమకు కేటాయించిన హ్యాండ్ బుక్ ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని ముఖ్యమైన నిబంధనలు మార్క్ చేసుకుని పెట్టుకోవాలన్నారు. మనకు కేటాయించిన హ్యాండ్‌బుక్ మనకు భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాంటిదని అందులని నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణ స్క్రూటిని ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ జాగ్రత్తగా చేయాలన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### పువ్వాళ్ల దుర్గాప్రసాద్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రఘునాథపాలెం మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలకు అనుగుణంగా పార్టీ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో సమన్వయంతో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఏకగ్రీవాలపై ఎక్కువగా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ తక్షణమే నిలిపేయాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** 5 షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు కేటాయించిన రిజర్వేషన్ నిలిపివేయాలని, ఆదివాసీ భూభాగంలో జడ్పీటీసీ,ఎంపీటీసీ రిజర్వేషన్లను గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు దొర బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజనేతర రిజర్వేషన్లను 5వ షెడ్యూల్ ప్రాంతంలో మినహాయించుకోవాలన్నారు. అధిక ఆదివాసీ భూ భాగం కలిగిన భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీమ్ జిల్లాలో జిల్లా పరిషత్ స్థానాలు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి ఆదివాసీ సమాజం సిద్ధంగా ఉందన్నారు.

## షటిల్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం

**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయదశమి పురస్కరించుకొని షటిల్ టోర్నమెంట్ పోటీలను చిన్నారులకు నిర్వహించారు. వైరాలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకోవాలని నేటి ఓటమి రేపటి గెలుపుకు బాట అని అన్నారు. చాలా అద్భుతంగా ఆట ఆడారని పిల్లలకు మంచి భవిష్యత్తు ఉందని, ఈ షటిల్ పోటీలు ద్వారా వ్యక్తమైందని ఆయన అన్నారు.

# ఖమ్మం జెడ్‌పి కైవసానికి కాంగ్రెస్ పావులు

### ఎస్టిలకు రిజర్వు అయిన జిల్లా పరిషత్ జనరల్‌కు కేటాయించిన భద్రాద్రి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న మీమాంస పక్కన పెడితే ఖమ్మం జెడ్పి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ చకచకా పావులు కదుపుతుంది. ముగ్గురు మంత్రులు, ఇద్దరు శాసన సభ్యులు ఉన్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మూడు నియోజక వర్గాల్లో మాత్రమే ఎస్టిలకు జెడ్పిటిసి స్థానాన్ని కేటాయించబడ్డాయి. జనరల్ కేటగిరిలో ఉన్న కామేపల్లి నుంచి కూడా ఎస్టి అభ్యర్థే రంగంలోకి దిగుతారన్న ప్రచారం జరుగుతుంది. ఎస్టిలకు రిజర్వు అయిన జెడ్పి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార పార్టీకి సంబంధించిన ఇద్దరు ప్రధాన నేతలు తమ అనుయయులను రంగంలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకరు వైరా నియోజక వర్గాన్ని ఎంచుకుంటే మరొకరు పాలేరు నియోజక వర్గాన్ని ఎంచుకున్నారు. ఖమ్మం జిల్లాలో 20 జెడ్పిటిసి స్థానాలకు గాను కూసుమంచి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, సత్తుపల్లి స్థానాలు ఎస్టిలకు రిజర్వు కాగా ఇందులో సత్తుపల్లి, తిరుమలాయపాలెం ఎస్టి మహిళలకు కేటాయించబడ్డాయి. తిరుమలాయపాలెం స్థానం నుంచి తన అనుచరురాలిని రంగంలోకి దింపి తద్వారా జెడ్పి పీఠంపై తన మనిషిని కూర్చోపెట్టాలని ఒక మంత్రి ప్రయత్నిస్తున్నాడు. ఇక్కడ కొంత స్థానిక స్థానికేతర సమస్య వచ్చినా మంత్రికి ఆ మండలంపైన, ఆ నియోజక వర్గంపైన గట్టి పట్టుండడంతో ఒకరిద్దరి వ్యతిరేకత చర్చనీయాంశం కాదన్న వాదన బలంగా వినపడుతుంది. ఇక మరో మంత్రి 2023 శాసన సభ ఎన్నికల కంటే ముందు నుంచే తన మనిషిగా ముద్ర వేయించుకున్న వ్యక్తిని కొణిజర్ల నుంచి బరిలోకి దింపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఖమ్మం, మధిర స్థానాలకు సంబంధించి ఎస్టి అభ్యర్థులకు ఎక్కడ జెడ్పిటిసి స్థానాలు రిజర్వు చేయబడలేదు. కొణిజర్ల నుంచి గెలిచే వారికి కానీ లేదా తిరుమలాయపాలెం నుంచి గెలిచే వారికి కానీ జెడ్పి స్థానం దక్కే అవకాశం ఉందని ప్రస్తుతం కాంగ్రెస్‌లో చర్చ సాగుతుంది. ఎవరి మాట నెగ్గితే వారి అభ్యర్థి ఛైర్మన్ అవుతారు. అది కూడా కాంగ్రెస్ మెజార్టీ స్థానాలను సంపాదించగలిగినప్పుడు మాత్రమే. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఉన్న సానుకూలత, సంక్షేమ పథకాలు ప్రజలతో ఉన్న సత్సంబంధాలు మంచి ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నారు. ప్రధాన విపక్షం బిఆర్‌ఎస్‌లో ఉలుకు పలుకు లేదు. కొద్ది రోజుల క్రితం ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని రఘునాథపాలెం మండల సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఎన్నికలను గట్టిగానే ఎదుర్కోవాలని నిర్ణయించారు. మిగిలిన నియోజక వర్గాల్లో ఈ జిల్లాల్లో ఎక్కడ సందడి లేదు. వామపక్షాలు తమ బలానికి తగిన రీతిలో పోటీ చేయాలని నిర్ణయించాయి. కోర్టు తీర్పు కంటే ముందే సన్నద్ధం చేసే పనిలో ఉనాన్నయి. బిజెపి హ డావుడి చేసి నా చేయకపోయినా ఇక్కడ వనగూరేది ఏమి లేదు.



**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఐదు శాసనసభ స్థానాలు ఉంటే అందులో నాలుగు ఎస్టిలకు రిజర్వు చేయబడిన ఈ నియోజక వర్గంలో జెడ్పి స్థానం మాత్రం జనరల్ అయింది. మెజార్టీ జెడ్పిటిసి స్థానాలు ఎస్టిలకే రిజర్వు చేయబడ్డాయి. రిజర్వేషన్ లాటరీ కావడంతో 20లో నాలుగు కేటాయించిన ఖమ్మం జెడ్పి ఎస్టిలకు రిజర్వు కాగా నాలుగు జనరల్ స్థానాలు ఉన్న కొత్తగూడెం జెడ్పిటిసి జనరల్ అయింది. ఇప్పుడే హడావుడి ఎందుకన్న భావనలో చాలా మంది ఉన్నారు. కొందరైతే జరిగే అవకాశమే లేదని తేల్చి పాడేస్తున్నారు. ఏమి జరుగుతుందో చూడాలి మరీ. అంత సానుకూలత వస్తే పోటీ రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

## రాజేశ్వరి ఆశయాల సాధనకు కృషి చేయ్యాలి: సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాచలం :** మారెడ్డి రాజేశ్వరి ఆశయాల సాధనకోసం పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ సతీమణి రాజేశ్వరి ప్రథమ వర్ధంతి సభ వారి స్వగృహమందు బుధవారం జరిగింది. సిపిఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావుతో కలిసి హాజరైన పాషా రాజేశ్వరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. వారి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ వారి ఆశయాల సాధన కోసం అనునిత్యం కృషి చేయాలన్నారు. మీసాల భాస్కర్ రావు, ఎస్‌వీఎస్ నాయుడు, వంకా మహేష్, ఏఐటియూసీ పట్టణ కార్యదర్శి కంభమెట్టు శ్రీనివాస్, సీతా రామ రాజు, బొల్లోజు వేణు, గుంజా రామారావు పాల్గొన్నారు.

## అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సహకరించండి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు సంగరేణి సం స్థ ద్వారా సహకరించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్‌ను కలిసి కోరారు.మంగళవారం రాత్రి సంస్థ ప్రధాన కార్యాలయంలో సి అండ్ ఎండిని కలిసి పుల ప్ర తిపాదనలు ఆయన ముందుంచారు. ఈ సందర్భ ంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఆర్టిసి బస్టాండ్ నూతన భవనాలకు సంస్థ ద్వారా నిధులు మంజూరు చేయాలన్నారు. సిఎస్ఆర్ స్కీ ం ఫండ్ సాధ్యమైనంత త్వరగా మంజూరు చే యాలని కోరినట్లు కూనంనేని తెలిపారు. పోస్టాఫీ స్ సెంటర్ నుండి డిఎస్‌పి ఆఫీస్ మీదుగా హేమచంద్రాపురం గ్రామం వరకు ఉన్న రోడ్డు సింగరేణి సంస్థ భారీ వాహనాలు రాకపోకల ద్వారా శిథిలమైందని, దీనిని సింగరేణి యాజమాన్యమే పునఃనిర్మించి ప్రజలకు ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని నివారించాలని కోరినట్లు చెప్పారు. సింగరేణి కార్మిక వాడలు, ప్రభావిత ప్రాం తాల్లో ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు యాజమాన్యం చొరవ చూపాలని, రుద్రంపూర్, రామవరం తదితర ప్రాంతాల్లో మాజీ కార్మికులు నివశిస్తున్న క్వార్టర్లను వారికే స్వాదీనం చేసి విద్యుత్,తాగునీరు వసతి కల్పించాలని కోరినట్లు చెప్పారు. కార్మిక వాడల్లో శిథిలమైన రోడ్లను నిర్మించాలని, నూతన భూగర్భ గనుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని, తన ప్రతిపాదనపై అధికారి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కూనంనేని వెంట సిపిఐ, ఏఐటియూసీ నాయకులు ఎస్‌కే సాబీర్ పాషా, వంగ వెంకట్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీ

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుంది అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో కర్నాటి కృష్ణయ్య భవనం లో బుధవారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం పాలపాటి అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో సాధ్యమైన ఎక్కువ స్థానాలలో పోటీ చేసి పార్టీ యొక్క విస్తరణలో భాగంగా ప్రతిష్టాత్మకంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జడ్పిటిసి కైనా పోటీ చేయాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలతో సత్సంబంధాలు ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే వారిని ఎంపీటీసీ, సర్పంచ్, ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని తెలిపారు. తెలివి ఉన్న యువకులు, సమస్యలు పరిష్కరించి ప్రజా ప్రతినిధుల, అధికారులను ఒప్పించి నిధులు తెచ్చే యువతను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ పోటీ చేసే ఎంపిటిసి స్థానాలు భైరవునిపల్లి, నాచేపల్లి, మంగాపురం తండా, నేలకొండపల్లి మూడు స్థానాల్లో పోటీలో ఉంటుంది అని తెలిపారు. సర్పంచ్ స్థానాలు భైరవునిపల్లి, అజయ్ తండా, సదాశివపురం, కొత్త కొత్తూరు, ము రాపురం, మంగాపురం తండా, నేలకొండపల్లి స్థానాలలో పోటీ చేస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు మల్లెబోయిన ఉపేందర్, మాలోతు అయోధ్య, కార్యవర్గ సభ్యులు మాధవ్, కాశబోయిన అయోధ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మణుగూరు:–**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్ధంగా ఉండాలి: సరెడ్డి పుల్లారెడ్డి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో మణుగూరు మండలంలో అన్ని ఎంపీటీసీ, పంచాయతీ వార్డులకు, సర్పంచ్ లకు సిపిఐ పోటీలలో నిలబడుతుందని, ఇందుకు క్యాడర్ సిద్ధంగా ఉండాలి అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో మండల, పట్టణ కార్యవర్గ సభ్యులు సమావేశం ఎడారి రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఎంపిటిసి, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అన్ని స్థానాల్లో పోటీ లో నిలబడుతుందని, దీనికి సీపీఐ క్యాడర్ సిద్ధంగా ఉండాలి అని వారు పిలుపునిచ్చారు. అందరికి తెలుసని, అధికారం ఉన్నా లేకున్న ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం కొనసాగించిన సిపిఐను ప్రజలు గెలిపించుకోవాలని అవసరం ఉందని వారు అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సొందే కుటుంబరావు, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, మంగి వీరయ్య, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, మహిళ సమైక్య మండల కార్యదర్శి దుబ్బాక నిర్మల, కొడిమల సుజాత, పట్టణ సహాయ కార్యదర్శి లు తోట రమేష్, చింతల దశరథం, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, నోముల రవి, జగ్గు వీరన్న పాయం శీను, వజ్జా వెంకటేశ్వర్లు, పులిగల రమేష్, అదెర్ల రాములు, మాజీ సర్పంచ్ పాయం కామరాజు, మాజీ ఎంపీటీసీ పాయం లక్ష్మయ్య, మామిడిపల్లి శ్రీను, కన్నెబోయిన ప్రసాద్, రంజిత్, లక్ష్మి రెడ్డి, సీహెచ్. ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు.



## నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి

### అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పెండింగ్ రైస్ డెలివరీపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి గత ఖరీఫ్ సీజన్ పెండింగ్ ఉన్న 11,500 మెట్రిక్ టన్నులు రా రైస్, బాయిల్డ్ రైస్ 3500 మెట్రిక్ టన్నులు రాబోయే 20 రోజుల పని దినాలలో ఎఫ్‌సిఐకు రైస్ మిల్లర్లు సరఫరా చేయాలన్నారు. రైస్ మిల్లర్లు రైస్ సరఫరా చేసేందుకు వీలుగా ఎఫ్‌సిఐ అధికారులు గోదాముల్లో స్పేస్ అందుబాటులో పెట్టాలని, గోదాములకు కనీస అప్రోచ్ రోడ్డు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి గత రబీ సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న 42వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీకు రోజుకు 600 మెట్రిక్ టన్నుల సరఫరా దాటడం లేదని దీనికి కారణాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రవాణా ఛార్జీలకు సంబంధించిన బిల్లులు రైస్ మిల్లర్లు శనివారం నాటికి అందిస్తే ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. రైస్ మిల్లర్లు తమ పూర్తి సామర్థ్యం మేరకు మిల్లింగ్ నిర్వహించి నిర్ణీత లక్ష్యం మేరకు రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. మిల్లర్ల దగ్గర ఉన్న నాణ్యమైన గన్ని సంచులను తీసుకునేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైస్ మిల్లర్ల సమస్యలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

## ఆది కర్మయోగి అభియాన్ విజయవంతానికి కృషి

### ఐటిడిఎ ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని మండలాల్లో ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నట్లు ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ చెప్పారు. సెక్రెటరీ ఆఫ్ మోటా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూ ఢిల్లీ మినిస్టరీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫైర్స్ నిబునాయర్ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో/టెలీకాన్ఫిరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా ఐటిడిఏ పరిధిలోని 19 మండలాల్లో గల 130 గ్రామ పంచాయితీల్లో గ్రామకార్యచరణ ప్రణాళికలు రూపొందించి పోర్టల్ లో కార్యాచరణ ప్రణాళిక పోర్టల్‌లో పొందుపరిచామని చెప్పారు. విలేజ్ నోడల్ ఆఫీసర్లు, బీఎంటీలు, సాతి సహాయోగులను నయమించిడం జరిగందని, వీరి ద్వారా ప్రతిగామ పంచాయితీలో ఆదిసేవ కేంద్రాలు ప్రారంభించామని, 130 పంచాయితీలలో ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, సిబ్బంది కార్తీక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## మేరి కుమారి వర్ధంతి సందర్భంగా పేదలకు చేయూత




**ప్రజాపక్షం/భద్రాచలం :** అప్పన మేరి కుమారి వర్ధంతిని పురస్కరించుకుని పరివర్తన యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజుపేట కాలనీలో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫౌండేషన్ సభ్యులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికలాంగులు, పేదలు, వృద్ధులకు అండగా నిరంతరం సేవలు చేస్తున్న అప్పన దాసుబాబు సోదరి మేరికుమారి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. దాసుబాబును ఆదర్శంగా తీసుకుని పేదలకు ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న, శాంతి, నవ్యశ్రీ, దివ్యశ్రీ, ప్రేమకుమారి,రాజు, సరళ, నిహాల్, రాజా కిరమ్, అలవాల రాజా, అల్లాడి పాల్‌రాజ్, జేపి, సుజాత, వాసు, రాణి తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కంచాల్ గ్రామంలో మావోయిస్టులు దాచి ఉంచిన డంప్‌ను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. కూంబింగ్‌లో భాగంగా బలగాలు అడవిలో గాలింపు చర్యలు చేపడుతుండగా గన్ పౌడర్, ఆర్‌డీఎక్స్,బీజీఎల్ రౌండ్స్, విల్లంబులకు అమర్చిన బాంబులు, పేలుడు పదార్థాలు, బ్యాటరీలు తదితరు సామాగ్రి స్వాదీనం చేసుకున్నారు. పోలీసులను హతమార్చడమే లక్ష్యంగా మావోయిస్టులు పేలుడు పదార్థాలు సిద్ధం చేశారని, కూంబింగ్‌లో ఇవ స్వాదీనం చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయిందని, సకాలంలో స్వాదీనం చేసుకోవడం పెద్ద కుట్ర భగ్నమైందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

## పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా చూడాలి

### జెడిపిటిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రవిబాబు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులలో లేకుండా చూడాలని జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రవిబాబు ఆదేశించారు. మండలం లోని కొత్తకొత్తూరు, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం లో ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు.ఓటర్లకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అదే విధంగా కొత్తకొత్తూరు లోని ప్రవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెటిరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ను పరిశీలించారు. పోలింగ్ బాక్సులు, ఇతరత్రా మెటిరియల్ పంపిణీ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.






















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com